మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 24-7-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 25 Issue: 25

Circulated to Telangana
Published from Jagitial


24 జూలై 2026 - శుక్రవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:56 సూర్యాస్తమయం - సా. 6:48 తిథి దశమి ఉ. 9:13 వరకు తరువాత ఏకాదశి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం అనురాధ తె. 4:29ం వరకు తరువాత జ్యేష్ఠ యోగం శుక్ల రా. 8:02 వరకు కరణం గరజి ఉ. 9:13 వరకు వనిజ రా. 10:23 వరకు వర్జ్యం ఉ. 6:11 నుండి ఉ. 7:59 వరకు దుర్ముహూర్తం ఉ. 8:31 నుండి ఉ. 9:22 వరకు మ. 12:48 నుండి మ. 1:39 వరకు రాహుకాలం ఉ. 10:46 నుండి మ. 12:22 వరకు యమగండం మ. 3:35 నుండి సా. 5:12 వరకు గుళికాకాలం ఉ. 7:33 నుండి ఉ. 9:09 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:20 నుండి తె. 5:08 వరకు అమృత ఘడియలు సా. 4:56 నుండి సా. 6:44 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:48 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



# ఫాస్ట్ ట్రాక్ కోర్టులు

## పేపర్ లీకేజీల విచారణకు త్వరలోనే అందుబాటులోకి.. ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనలపై ఎట్టకేలకు ప్రధాని మోదీ స్పందించారు. పేపర్ లీకేజీల విచారణ కోసం దేశవ్యాప్తంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని కీలక ప్రకటన చేశారు. సోషల్ మీడియా వేదికగా మాట్లాడిన ఆయన.. యువత, విద్యార్థుల ప్రయోజనాలు, వారి సంక్షేమమే తమ ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. అలాగే విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవాలని చూసే అక్రమార్కులను ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచి పెట్టబోమని హెచ్చరించారు. పేపర్ లీకేజీకి కారణమైన బాధ్యులకు త్వరితగతిన కఠిన శిక్షలు పడేలా చూసేందుకు ప్రత్యేకంగా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను అందుబాటులోకి తీసుకు వస్తున్నట్లు ఆయన తెలిపారు. దీనికి సంబంధించి అవసరమైన అన్ని చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.



న్యూఢిల్లీ: ఈ వ్యవహారంపై గురువారం రాత్రి ఆయన మరోసారి స్పందిస్తూ.. శుక్రవారం నిర్వహించనున్న కేంద్ర మంత్రివర్గ సమావేశంలో పేపర్ లీక్ వ్యవహారంపై మరిన్ని కఠిన చర్యలు ప్రకటించనున్నట్లు తెలిపారు. 'నీట్ పేపర్ లీక్ ఘటన జరిగినప్పటి నుంచి అనేక చర్యలు తీసుకున్నాం. ఈ ఘటనలో బాధ్యులను పట్టుకున్నాం. నిందితులు ప్రస్తుతం జైలులో ఉన్నారు. విద్యార్థుల విద్యాసంవత్సరం వృథా కాకుండా చూడటమే మా బాధ్యత.' అని ప్రధాని మోదీ చెప్పారు. అదే సమయంలో ఢిల్లీ హైకోర్టు.. ఓ ఫాస్ట్‌ట్రాక్ కోర్టును నోటిఫై చేసింది. రౌస్ అవెన్యూ ప్రాంగణంలో ఈ ప్రత్యేక కోర్టు ఏర్పాటు కానుంది. జడ్జి అను గ్రోవర్ ఈ కోర్టు కార్యకలాపాలను చూస్తారని దిల్లీ హైకోర్టు యంత్రాంగం పేర్కొంది. పబ్లిక్ ఎగ్జామినేషన్స్ చట్టం-2024 కింద నమోదు చేసిన, సంబంధిత కేసులను ఈ కోర్టు విచారించనుంది. ఇక, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వినీత్ జోషిని పంచాయతీరాజ్ శాఖకు బదిలీ చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఆయన స్థానంలో నరేశ్ కుమార్ గంగ్వార్‌ను నియమించింది. వినీత్ జోషి పాఠశాల విద్యాశాఖ కార్యదర్శిగానూ విధులు నిర్వహిస్తుండగా, నూతనంగా టీకే అనిల్ కుమార్‌కు ఈ బాధ్యతలు అప్పగించింది. ప్రధాని మోదీ ప్రకటనపై లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. విద్యావ్యవస్థ వీధిన తరువాయి 2 వ పేజీలో...

# నీట్-2024 లీక్ ప్రధాన సూత్రధారికి క్లీన్ చిట్

## లీకేజీపై ఎలాంటి ఆధారాల్లేవు: సీబీఐ




న్యూఢిల్లీ: నీట్-2024 ప్రశ్నాపత్రం లీక్‌లో ప్రధాన సూత్రధారికి సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) క్లీన్ చిట్ ఇచ్చింది. అతడిపై ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేసింది. మొదటిసారి నీట్ పశ్నాపత్రం లీక్ కావడం 2024లో సంచలనం సృష్టించింది. పశ్నాపత్రం దొంగిలించి పంపిణీ చేయడంపై బిహార్ పోలీసులు అప్పట్లో దర్యాప్తు చేపట్టారు. ప్రధాన సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొన్న సంజీవ్ కుమార్ అలియాస్ సంజీవ్ ముఖియా తరువాయి 2 వ పేజీలో...

# సోనమ్ వాంగ్ చుక్ ఆమరణ నిరహార దీక్ష విరమణ

న్యూఢిల్లీ: దేశ విద్యావ్యవస్థలో పారదర్శకత, సమగ్ర సంస్కరణల కోసం గత 26 రోజులుగా లడఖ్ పర్యావరణవేత్త, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ఎట్టకేలకు ముగిసింది. కేంద్ర ప్రభుత్వంతో జరిగిన కీలక చర్చల అనంతరం ఆయన తన సుదీర్ఘ దీక్షను విరమించేందుకు అంగీకరించారు. విద్యార్థుల ఆందోళనలు, విద్యావ్యవస్థలో చేపట్టాల్సిన మార్పులు, పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకతపై కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ సోనమ్ వాంగ్‌చుక్‌తో సుదీర్ఘ సంప్రదింపులు జరిపారు. ఈ చర్చల సందర్భంగా తరువాయి 2 వ పేజీలో...

# ఓయూ, జేఎన్‌టీయూ పరీక్షలు వాయిదా

2



# గ్లోబరీనా కేటీఆర్ బినామీ

## నీట్ పేపర్ లీకేజీకి కేటీఆర్ గురువు.. అందుకే బీజేపీపై బీఆర్ఎస్ మౌనం

### తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే గ్లోబరీనాపై విచారణ.. చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు

తెలంగాణలో 27 మంది ఇంటర్మీడియట్ విద్యార్థుల బలవన్మరణానికి కారణమైన గ్లోబరీనా టెక్నాలజీస్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బినామీ కంపెనీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. అది తన బినామీ కంపెనీ కాదని రుజువు చేసుకునేందుకు సీసీఎస్‌లో కేటీఆర్ ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి నిజాలు ప్రజలకు తెలియచేస్తామని అన్నారు.

హైదరాబాద్, జూలై 23 (ఈవార్తలు): గురువారం అసెంబ్లీలో మరమ్మతు పనులను శాసన సభ స్పీకర్ జీ ప్రసాద్ కుమార్ తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యవేక్షించారు. ఆ తరువాత రేవంత్ రెడ్డి అసెంబ్లీ మీడియా కమిటీ హాలు లో మీడియాతో చిట్‌చాట్ చేశారు. 27 మంది అభంశుభం తెలియని ఇంటర్మీడియట్ విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమైన గ్లోబరీనాను బ్లాక్ లిస్టులో పెట్టకపోవడంతో కో ఎంప్ట్ ఎడ్యూటెక్‌గా రూపాంతరం చెంది, ఢిల్లీలో సీబీఎస్ఈ 12వ తరగతి మూల్యాంకనం కాంట్రాక్టు దక్కించుకున్నదని తరువాయి 2 వ పేజీలో...



# సారీ చెప్పు.. కోర్టుకు ఈడుస్తా

## సీఎం రేవంత్‌కు కేటీఆర్ 48 గంటల డెడ్‌లైన్

### సివిల్, క్రిమినల్, పరువు నష్టం దావా వేస్తానని వార్నింగ్

సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లీగల్ నోటీసులు జారీ చేశారు. గ్లోబరీనా సంస్థ అంశంలో రేవంత్ రెడ్డి చేసిన అసత్య ఆరోపణలపై 48 గంటల్లో బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా రేవంత్ రెడ్డి మీడియాలో తప్పుడు ప్రచారం చేశాడని.. 48 గంటల్లోగా క్షమాపణ చెప్పకుంటే సివిల్, క్రిమినల్ చర్యలతో పాటు పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు.

హైదరాబాద్, జూలై 23 (ఈవార్తలు): రేవంత్ రెడ్డి ఆరోపణలపై ఇప్పటికే కేటీఆర్ స్పందిస్తూ.. తాను లై డిటెక్టర్ పరీక్షతో పాటు సీఐడీ విచారణకు సిద్ధం.. మరి రేవంత్ రెడ్డి తన కుటుంబ అవినీతి అంశంలో సిట్, సీఐడీ విచారణకు సిద్ధమా..? అని సవాల్ విసిరారు. నాపై చేసిన ఆరోపణలను రుజువు చేయాలి.. లేదంటే రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గ్లోబరీనా సంస్థ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని.. గ్లోబరీనా సంస్థ నిజంగానే నా బినామీ సంస్థే అయితే అదే సంస్థతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఒప్పందాలు చేసుకుందని కేటీఆర్ ప్రశ్నించారు. మీ ప్రభుత్వమే ఆ సంస్థతో ఒప్పందాలు చేసుకుని, ఇప్పుడు అది నా బినామీ సంస్థ అని చెప్పడం ఎంతవరకు సమంజసం. రాజ్ భవన్ ధర్నా ముందు చేయాల్సిన కొడంగల్‌లో చేయడం రాజకీయ నాటకం మాత్రమేనన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ముఖ్యమంత్రి ఒక్కసారి కూడా ప్రధాని నరేంద్ర మోదీ పేరును ప్రస్తావించరు, రేవంత్ రెడ్డి మోదీ పేరును ప్రస్తావించడానికి కూడా భయపడుతున్నాడు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి ఒక మూట ఇస్తే, బీజేపీకి రెండు తరువాయి 2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,651 |
| వెండి (కిలో): | రూ.2,45,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,137 |

## విశ్వవాణి




### గూగుల్‌కు రూ.8,200 కోట్ల ఫైన్

లండన్: టెక్ దిగ్గజం ఆల్ఫాబెట్ అనుబంధ సంస్థ గూగుల్‌కు యూరోపియన్ యూనియన్ (ఈయూ) భారీ షాక్ ఇచ్చింది. డిజిటల్ మార్కెట్స్ యాక్ట్ (డీఎంఏ) నిబంధనలను ఉల్లంఘించినందుకు ఏకంగా 890 మిలియన్ యూరోల (సుమారు రూ. 8,200 కోట్లకు పైగా) జరిమానా విధిస్తూ నిర్ణయం తీసుకుంది. టెక్ కంపెనీల ఆధిపత్యాన్ని అరికట్టే లక్ష్యంతో తీసుకొచ్చిన ఈ నూతన చట్టం కింద గూగుల్‌పై చర్యలు తీసుకోవడం ఇదే తొలిసారి.

# 'కుశ' క్షిపణి ప్రయోగం విజయవంతం

## ఒడిశా తీరంలో పరీక్ష నిర్వహించిన డీఆర్‌డీఓ

### సుదూర గగనతల లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం

### రక్షణ రంగంలో ఇదొక మైలురాయి: రాజ్‌నాథ్ సింగ్

రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) మరో కీలక విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. సుదూర లక్ష్యాలను ఛేదించగల 'కుశ' క్షిపణి తొలి ప్రయోగాన్ని గురువారం విజయవంతంగా నిర్వహించింది. ఒడిశా తీరంలోని ఏపీజే అబ్దుల్ కలాం ఐలాండ్ నుంచి ఈ పరీక్షను చేపట్టినట్లు డీఆర్‌డీఓ వర్గాలు వెల్లడించాయి.



న్యూఢిల్లీ: గగనతలంలో అత్యంత వేగంగా, ఎత్తులో ప్రయాణించే ఎలక్ట్రానిక్ లక్ష్యాన్ని అనుకరించి ఈ పరీక్ష నిర్వహించగా, 'కుశ' క్షిపణి దానిని విజయవంతంగా అడ్డగించిందని డీఆర్‌డీఓ ఒక ప్రకటనలో తెలిపింది. యుద్ధ విమానాలు, క్షిపణులు, మానవరహిత వైమానిక వాహనాలు, శత్రువులకు చెందిన భారీ విమానాలను కూడా సుదూరంలోనే నాశనం చేయగల సత్తా ఈ క్షిపణి వ్యవస్థకు ఉంది. తరువాయి 2 వ పేజీలో...




# ఈ20యే ఫైనల్

## సాధారణ పెట్రోల్ అందుబాటులోకి రాదు

### పార్లమెంటులో ప్రకటించిన కేంద్రం

న్యూఢిల్లీ: ఇంధనాల్ కలిపిన (ఈ20) పెట్రోల్‌పై కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో కీలక ప్రకటన చేసింది. ఇది పూర్తి సురక్షితమైందని, స్వచ్ఛమైందని, సాంకేతికంగా అధునాతమైందని పేర్కొంది. అంతే కాదు, ఇథనాల్ లేని సాధారణ పెట్రోల్‌ను అందుబాటులోకి తెచ్చే ఆలోచన ఏదీలేదని తేల్చిచెప్పింది. అయితే, పెట్రోల్‌లో ఇథనాల్‌ను 20 శాతం కంటే పెంచే ప్రతిపాదన కూడా లేదని ఈ మేరకు లోక్‌సభలో కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. తక్కువ నాణ్యతా ప్రమాణాల వైపు తిరిగి వెళ్లడం తరువాయి 2 వ పేజీలో...

# భర్త హత్య కేసులో భార్యకు జీవితఖైదు

## ప్రియుడు, అతడి సోదరుడికి కూడా.. కీలకంగా కూతురి వాంగ్మూలం



ఉత్తర ప్రదేశ్‌లోని ఆగ్రాలో చోటుచేసుకున్న పాత హత్య కేసులో ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ చట్టం కోర్టు కీలక తీర్పును ప్రకటించింది. 2021 జూన్‌లో జరిగిన 35 ఏళ్ల షూ ఫ్యాక్టరీ యజమాని నరేష్ కుమార్ దారుణ హత్య వ్యవహారంలో 33 ఏళ్ల ఆయన భార్య ప్రమిత, ఆమె ప్రియుడు 31 ఏళ్ల రవికాంత్ రాజ్‌పుత్, అతడి సోదరుడు 34 ఏళ్ల శశికాంత్ రాజ్‌పుత్‌లను దోషులుగా నిర్ధారిస్తూ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి శివ్ కుమార్ మంగళవారం యావజ్జీవ కారాగార శిక్ష ఖరారు చేశారు.

ఆగ్రా: దీంతో పాటు ఒక్కో దోషికి రూ. 1.1 లక్షల చొప్పున జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో సంవత్సరం అదనపు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అయితే ఈ కేసులో తండ్రిని చంపింది తన తల్లి, ఆమె ప్రియుడు, ప్రియుడి సోదరుడే అన్న విషయాన్ని మృతుడు నరేష్ కుమార్ తొమ్మిదేళ్ల కుమార్తె చెప్పింది. సంఘటన జరిగిన సమయంలో తొమ్మిదేళ్లు కల్గిన ఈ చిన్నారి.. కోర్టు ముందు సంచలన తరువాయి 2 వ

# రాశి ఫలాలు

24.7.2026

మేషం: ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చెయ్యడం మంచిది కాదు. మాతృ వర్గ బంధువుల నుండి వివాదాలు కలుగుతాయి. చేపట్టిన పనులలో జాప్యం కలుగుతుంది. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు వాయిదా పడతాయి. నిరుద్యోగులకు రావలసిన అవకాశములు అందక నిరాశ పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలు మందగిస్తాయి.

వృషభం: ఇంటా బయట సంతోషకర వాతావరణం ఉ ంటుంది. నూతన వస్తు వస్త్ర లాభాలు పొందుతారు. సంతాన విద్యా ఉద్యోగ విషయాలలో ఆశించిన ఫలితాలు పొందుతారు. అన్నివైపుల నుండి ఆదాయం అందుతుంది. వృత్తి ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగుతాయి. నూతన వాహన యోగం ఉన్నది.

మిధునం: మానసిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. కుటుంబ విషయంలో తొందరపాటు ఆలోచనలు ఇబ్బందికి గురిచేస్తాయి. వృత్తి వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఇతరులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వృధా ఖర్చులు పెరుగుతాయి. చిన్ననాటి మిత్రులతో ఆధ్యాత్మిక,సేవ కార్యక్రమాలలో పాల్గొంటారు.

కర్కాటకం: ముఖ్యమైన పనులు ప్రారంభించి విజయం సాధిస్తారు. కుటుంబ విషయంలో నూతన ఆలోచనలు అమలు చేస్తారు. ఆర్థిక పరిస్థితి ఆశించిన రీతిలో ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో ధైర్యంగా నిర్ణయాలు తీసుకుంటారు. నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి. ఉద్యోగుల కష్టం ఫలిస్తుంది.

సింహం: చేపట్టిన పనులలో అవాంతరాలు చికాకు పరుస్తాయి. వృత్తి ఉద్యోగాలలో మీ శ్రమకు తగిన గుర్తింపు లభించదు. ఆర్థిక వ్యవహారాలలో స్వంత ఆలోచనలు కలసిరావు. భాగస్వామ్య వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. గృహమున కొందరి ప్రవర్తన ఆశ్చర్యం కలిగిస్తుంది.

కన్య: ఋణ పరమైన సమస్యలు నుండి బయటపడతారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో కొన్ని పనులను పూర్తిచేస్తారు. వృత్తి, ఉద్యోగాలలో ఉన్నత పదవులు పొందుతారు. వ్యాపారాలలో అంచనాలను దాటి లాభాలు అందుతాయి.

తుల: బంధు మిత్రులతో గృహమున ఆనందంగా గడుపుతారు. చేపట్టిన పనులలో అవరోధాలు ఉ న్నప్పటికీ సకాలంలో పూర్తిచేస్తారు. ఆర్థిక ఇబ్బందులు అధిగమించి దీర్ఘాకాలిక ఋణాలు సైతం తీర్చగలుగుతారు. ఉద్యోగాలలో అధికారుల ఆదరణ పెరుగుతుంది. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

వృశ్చికం: ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. భవిష్యత్తుకు సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో కుటుంబ సభ్యులతో విశేషంగా పాల్గొంటారు. వృత్తి ఉద్యోగాలలో అరుదైన అవకాశములు అందుతాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

ధనస్సు: శారీరక మానసిక ఆరోగ్య సమస్యలు చికాకు పరుస్తాయి. ఇతరులపై మీ ఆలోచనా విధానం మార్చుకోవడం మంచిది. అనుకున్న సమయానికి అనుకున్న విధంగా పనులు పూర్తికావు. బంధు మిత్రులతో చిన్న చిన్న విభేదాలు తప్పవు. వృత్తి ఉ ద్యోగాలలో అధికారులతో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి.

మకరం: నూతన వస్తు వాహన సౌకర్యాలు పొందుతారు. ధనపరంగా చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. బంధు మిత్రుల సమాగమం ఆనందం కలిగిస్తుంది. ఉ ద్యోగాలలో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. దూర ప్రయాణ సూచనలున్నవి. చేపట్టిన పనులు సజావుగా సాగుతాయి. నిరుద్యోగ సమస్యలు పరిష్కారమౌతాయి.

కుంభం: ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. చేపట్టిన పనులలో జాప్యం కలిగిన నిదానంగా పూర్తిచేస్తారు. కీలక వ్యవహారాలలో సోదరుల సలహాలను తీసుకుని ముందుకు సాగడం మంచిది. సంతానం విషయంలో శుభవార్తలు అందుతాయి. ఉ ద్యోగ వాతావరణం అనుకూలంగా ఉంటుంది.

మీనం: దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ధన విషయాలలో ఇతరులకు తొందరపడి మాట ఇవ్వడం మంచిది కాదు. వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. ప్రారంభించిన పనులు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగ వాతావరణం సమస్యాత్మకంగా ఉండి శిరో బాధలు పెరుగుతాయి.

# ఫాస్ట్ ట్రాక్ కోర్టులు



**మొదటి పేజీ తరువాయి**

పడుతుంటే చూస్తూ ఉండిపోయారని, నిందితులను రక్షించిన చరిత్ర కేంద్ర ప్రభుత్వా నిదేనని ఆయన ధ్వజమెత్తారు. ఈ సందర్భం గానే ఆయన మూడు ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు. మొదటగా విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బాధ్య తల నుంచి తొలగించాలని, బాధిత విద్యార్థుల కు ప్రభుత్వం బహిరంగ క్షమాపణ చెప్పాలని, యువత భవిష్యత్తును దెబ్బతీసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు నిరసనలకు పిలుపునిచ్చిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కూడా ప్రధాని ప్రకటన ను తోసిపుచ్చింది. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ప్రకటన తో సరిపెట్టకుండా విద్యాశాఖ మంత్రి రాజీనా మా చేయాల్సిందేనని ఆ పార్టీ ఎక్స్ వేదికగా తమ డిమాండ్‌ను పునరుద్ఘాటించింది.

ఆందోళనకారుల పాస్‌పోర్టులు రద్దు!

నీట్ పేపర్ లీక్, చలో పార్లమెంట్ ఆందోళనల్లో పాల్గొన్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. నిరసనల్లో పాల్గొన్న వారిని గుర్తించి, వారి పాస్‌పోర్టులు కూడా రద్దు చేయాలని ఢిల్లీ పోలీసులు నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు పోలీసు వర్గాలు వెల్లడించాయి. దీనిపై ఇప్పటికే కార్యాచరణ కూడా ప్రారంభమైనట్లు తెలుస్తోంది.



# సోనమ్ వాంగ్ చుక్ ఆమరణ నిరహార దీక్ష విరమణ

**మొదటి పేజీ తరువాయి**

పరీక్షల లీకేజీలపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని కొద్దిసేపటి క్రితం ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వీడియో ప్రకటనతో పాటు, విద్యా వ్యవస్థలో అవసరమైన సంస్కర ణలు తీసుకువస్తామని కేంద్ర మంత్రులు స్పష్టమైన హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుండి వచ్చిన ఈ సానుకూల స్పందన, స్పష్టమైన హామీతో సంతృప్తి చెందిన సోనమ్ వాంగ్‌చుక్ పానీయం సేవించి తన 26 రోజుల ఆమరణ నిరాహార దీక్షను అధికారికంగా ముగించారు.

నేడు సీజేపీ దేశవ్యాప్త నిరసనలు

న్యూఢిల్లీ: కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తోన్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) 2026, జులై 24న దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది. నీట్ పేపర్ లీక్, విద్యార్థులపై లాఠీచార్జ్□కు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసనలు చేపట్టాలని తమ మద్దతుదారులు, విద్యార్థులకు సూచించింది. నీట్ పేపర్ లీక్□కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తూ దేశవ్యాప్తంగా పోలీసుల క్రూరత్వానికి గురైన బాధితులకు సంఘీభావం తెలిపేందుకు జులై 24న దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చినట్లు సీజేపీ తెలిపింది. నిరసనలకు అనుమతులు, ఏర్పాట్ల కోసం విద్యార్థి సంఘాలు, సీజేపీ బృందాలు కలిసికట్టుగా పనిచేయాలని సూచించింది. నిరసన కార్యక్రమంలో విద్యార్థులు తమ డిమాండ్లపై బిగ్గరగా గొంతెత్తాలని.. పోలీసుల క్రూరత్వానికి గురైన వారికి సంఘీభావం తెలిపాలని కోరింది. ఆందోళనకారులు జై హింద్, భారత్ మాతా కీ జై, ఇంక్విలాబ్ జిందాబాద్, జై భీమ్ వంటి సానుకూల నినాదాలు మాత్రమే ఇవ్వాలని సూచించింది. ఏమి జరిగినా కూడా ఆందోళనకారులు శాంతియుతంగా, అహింసాయుతంగా ఉండాలని సీజేపీ విజ్ఞప్తి చేసింది. నీట్ పేపర్ లీక్ ఇష్యూపై చర్చలకు సిద్ధమని కేంద్ర ప్రకటించినప్పటికీ కాక్రోచ్ జనతా పార్టీ దేశవ్యాప్త నిరసనలకు పిలుపునివ్వడం గమనార్హం.

# గ్లోబరీనా కేటీఆర్ బినామీ

**మొదటి పేజీ తరువాయి**

అన్నారు. కేటీఆర్ అప్పుడే గ్లోబరీనాను బ్లాక్ లిస్టులో పెట్టి ఉంటే సీబీఎస్ఈ మూల్యాంకనం కాంట్రాక్టు దక్కేది కాదని, విద్యార్థులకు కష్టాలు తప్పేవి అన్నారు. ఈ తప్పిదానికి కారకుడు కేటీఆర్ అని విమర్శించారు. ఇవి మరిచిపోయి తనకు లాయర్ నోటీసులు ఇస్తానంటే బెదిరిపోతానా? అని ప్రశ్నించారు. పరువు ఉన్నోడు పరువు నష్టం దావా వేస్తే విలువ ఉంటుందని ఆయన చురకలు అంటించారు. గ్లోబరీనాతోపాటు రంగారెడ్డి జిల్లా జన్వాడ ఫామ్ హౌస్‌కు సంబంధం లేదని కేటీఆర్ సీసీఎస్‌లో ఫిర్యాదు చేస్తే నిజాలు నిగ్గుతేలుస్తామన్నారు. ఇంటర్ విద్యార్థు తల్లిదండ్రులు కూడా సీసీఎస్ లో ఫిర్యాదు చేస్తే ప్రభుత్వం విచారణకు ఆదేశిస్తుందని, తామంత తాముగా విచారణకు ఆదేశించే పరిస్థితి లేదన్నారు. ఎప్పుడో జరిగిన ఘటనను ఇప్పుడు పరిగణనలోకి తీసుకుంటే తమపై కక్ష సాధిస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ఏడ్చే ప్రమాదముందని సెటైర్ వేశారు. గ్లోబరీనా టెక్నాలజీ మోసాలను ఆదర్శంగా తీసుకొని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నీట్ అండర్ గ్రాడ్యుయేట్ పేపర్‌ను లీక్ చేయిచారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. 2019 లో ఇంటర్మీడియట్ మూల్యాంకనంలో తక్కువ మార్కులు రావడంతో పలువురు విద్యార్థులు బతుకు ఆగమైందని, ఫెయిల్ అయ్యామనే అవమాన భారంతో 27 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. గ్లోబరీనా మూల్యాంకనం కారణంగానే 27 మంది చనిపోయారన్నారు. దానిని బ్లాక్ లిస్టు లో పెట్టకపోవడంతో తన పేరు మార్చుకుని కోఎంప్ట్ ఎడ్యుకేషన్ గా తన పేరును మార్చుకుని ఢిల్లీ స్థాయికి చేరిందన్నారు. ఢిల్లీలో సీబీఎస్ఈ మూల్యాంకనం కాంట్రాక్టు దక్కించుకుని లక్షలాది మంది విద్యార్థుల బతుకు ఆగం చేసిందన్నారు. గ్లోబరీనా వెనకాల కేటీఆర్ ఉన్నారని, అందుకే ఢిల్లీలో కాంట్రాక్టు దక్కించుకుందన్నారు. ముందుగా గ్లోబరినా కుంభకోణంపై మాజీ మంత్రి కేటీఆర్ తెలంగాణ విద్యార్థులకు క్షమాపణ చెప్పాలన్నారు. చేసిన తప్పుకు తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ముక్కు నేలకు రాయాలన్నారు. తెలంగాణలో పదేళ్ల పాలనలో నోటీఫికేషన్లు ఇవ్వడం, కోర్టులకు వెళ్లేలా చేయడం, నియామకాలు చేయకుండా నిలిపివేశారని బీఆర్ఎస్ పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు గ్రూప్-1 పేపర్ కూడా అమ్ముకున్నారన్నారు. రంగారెడ్డి జిల్లాలో జన్వాడ పామ్ హౌస్ భూములు ఏ రాజు నుండి కేటిఆర్ కు వచ్చాయో వివరించాలన్నారు. జన్వాడ భూములు నావి కావని కేటీఆర్ ముందుకు వచ్చి సీసీఎస్ లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు అందిన వెంటనే గ్లోబరీనా కుంభకోణం, జన్వాడ ఫామ్ హౌస్ భూములపై విచారణకు ఆదేశిస్తానని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గ్లోబారినా మోసాలపై విజిలెన్స్ విచారణ జరుగుతుందన్నారు. సీబీఎస్ఈ పరీక్షల మూల్యాంకనం, నీట్ పరీక్షలో ఫెయిల్ అయిన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విషయం లో బీఆర్ఎస్ పార్టీ ఎందుకు మాట్లాడడం లేదో సమాధానం చెప్పాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పర్మిషన్ ఇవ్వడంతో శుక్రవారం నాడు నాడు హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద బీఆర్ఎస్ వాళ్లు ధర్నా చేస్తున్నారన్నారు. తాము అధికారంలోకి ఉండగా ధర్నాచౌక్ ను ఎత్తివేశారని, ప్రతిపక్షంలోకి వచ్చిన తరువాత అదే ధర్నా చౌక్ బీఆర్ఎస్ కు దిక్కయ్యిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో శాంతి యుతంగా ధర్నాలు, నిరసనలు తెలుపవచ్చని, వారికే పోలీసులు అనుమతులు ఇస్తారని రేవంత్ రెడ్డి అన్నారు.

## హరీశ్‌కు ఆరు నెలలు మంత్రి పదవి ఇవ్వలేదు

మేడిగడ్డ బారాజ్ కూలిపోయింది వాళ్ళ ప్రభుత్వంలోనే కదా.. వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు కాపర్ డ్యాం ఎందుకు కట్టలేదని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. అధికారం కోల్పోయిన తరువాత మతిభ్రమించి ఇష్టారీతిగా కాళేశ్వరం పై మాట్లాడుతున్నారన్నారు. కాపర్ డ్యామ్ నిర్మాణం చేయాలని మమ్మల్ని ఎందుకు అడుగుతున్నారో అర్థం కావడం లేదన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి టర్మ్ లో నీటి పారుదల శాఖ మంత్రిగా పనిచేసిన హరీశ్ రావు, రెండో టర్మ్ లో మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో డిజైన్లు మార్చి, కాంట్రాక్టర్ల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసిన విషయం మేనమామ, సీఎం కేసీఆర్ కు తెలియడంతో పదవి ఇవ్వకుండా ఆరు నెలలు పక్కన పెట్టిన విషయం ప్రజలకు తెలియదు అనుకుంటున్నావా అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఆరు నెలలు మంత్రి పదవి ఇవ్వకుండా ఎందుకు కూర్చోబెట్టారనే విషయాన్ని హరీశ్ రావు సమాధానం చెప్పి కాళేశ్వరం పై మాట్లాడాలన్నారు. కాళేశ్వరం విషయంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఆదేశాలను అమలు చేస్తున్నామని, అది కేంద్ర ప్రభుత్వంలోని చట్టబద్ద సంస్థ అని అన్నారు. మేడిగడ్డ కూలిన తరువాత ఎన్ డీ ఎస్ ఏ చైర్మన్ నాణ్యత ప్రమాణాలు ఎలా చూస్తారని అప్పటి బీజేపీ ఎంపీ బండి సంజయ్ కేంద్ర జలశక్తి మంత్రికి స్వయంగా పిర్యాదు చేశారని, ఈ విషయాన్ని బీఆర్ఎస్ నేతలు మరిచిపోయారన్నారు. దేవాదుల ప్రాజెక్టు పనులు వాళ్ళు పూర్తి చేయకపోవడంతో తాము అధికారంలోకి వచ్చిన తరువాత దశల వారీగా పూర్తి చేస్తున్నామన్నారు. దేవాదులను గతేడాది, ఈ ఏడాది నీటి పారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి సందర్శించి పనులు పర్యవేక్షిస్తున్నారన్నారు. ఆంధ్రా వాళ్ళు భద్రాచలంలో 7 మండలాలు ముంపు పేరుతో ఏపీలో కలిపితే అప్పుడు సీఎంగా ఉన్న కేసీఆర్ ఎందుకు మాట్లాడలేదో ప్రజలకు చెప్పాలని రేవంత్ రెడ్డి నిలదీశారు.

## ఓటు.. జాగ్రత్త

దేశంలో ప్రస్తుత బీజేపీ ఏలుబడిలో ఓటు హక్కు అనేది ప్రతి పౌ రుడికి విలువైనది, చాలా ముఖ్యమైనదని రేవంత్ రెడ్డి అన్నారు. అం దుకే ప్రజలంతా చాలా జాగ్రత్తగా ఉండాలని కోరినట్లు తెలిపారు. రాష్ట్రంలో 70 శాతం సర్ ప్రక్రియ ముగిసిందని, ఇంకా 30 శాతం మిగిలి ఉందన్నారు. సర్ విషయంలో ప్రజలకు అన్యాయం జరగకుండా ఉండేందుకు పార్టీ కార్యకర్తలు అలెర్ట్ ఉండాలన్నారు. బీఎల్ఓ ల కంటే గల్లి లో ఉన్న పార్టీ కార్యకర్తలు ప్రతి ఓటరును గుర్తు పడతారన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో తనకు రెండు ఓట్లు ఉన్నాయంటూ పిర్యాదు చేస్తే, విచారణ చేయిస్తానని, తప్పుడు ఫిర్యాదు చేసిన వారిని జైలులో వేయిస్తానని ఆయన హెచ్చరించారు. సర్ పేరుతో రాష్ట్రంలో ఓట్లు తొలగించే కుట్ర ఉందని, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లు పోతే కాంగ్రెస్ ఓట్లు పోయినట్లేనన్నారు. సర్ వల్ల అక్షర దోషాలు చూపిస్తూ, తప్పులు వెతికి మరీ గ్రామీణ ప్రాంతాల్లో అమాయక ఎస్సీ, ఎస్టీల ఓట్లు తొలగిస్తున్నారన్నారు.

# సారీ చెప్పు.. కోర్టుకు ఈడుస్తా

**మొదటి పేజీ తరువాయి**

మూటలు పంపుతున్నాడని అన్నారు. ఒకవైపు పాత కేసుల భయం, మరోవైపు అమృత్ పథకం, ఇతర కాంట్రాక్టుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వంతో రాజీ రాజకీయాలు నడుస్తున్నాయని ఆరోపించారు.

## పుట్టినరోజు వేడుకలకు కేటీఆర్ దూరం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం (జూలై 24) తన పుట్టినరోజు వేడుకలకు దూరంగా ఉ ండాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీ వీధుల్లో 'నీట్' పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా పోరాడుతున్న విద్యార్థులకు సంపూర్ణ సంఘీభావం తెలపడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ప్రకటించారు. ఆడంబరాలకు స్వస్తి చెప్పి, విద్యార్థుల హక్కుల కోసం తాము కూడా నేరుగా పోరాటం చేస్తామని తెలిపారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సాగుతున్న ఈ పోరాటానికి మద్దతుగా... హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద బీఆర్ఎస్ విద్యార్థి విభాగం చేపట్టనున్న భారీ నిరసన కార్యక్రమంలో కేటీఆర్ స్వయంగా పాల్గొననున్నారు.

# ఓయూ, జేఎన్‌టీయూ పరీక్షలు వాయిదా

న్యూఢిల్లీ: ఢిల్లీలో 'ఛలో పార్లమెంట్' సందర్భంగా విద్యార్థులపై లాఠీఛార్జికి నిరసనగా వామపక్ష విద్యార్థి సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా బంద్‌కు పిలుపునివ్వడంతో ఉస్మానియా యూనివర్సిటీ కీలక నిర్ణయం తీసుకుంది. జూలై 24, శుక్రవారం ఓయూ, అనుబంధ కాలేజీల్లో జరగాల్సిన సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేసింది. పరీక్షల వాయిదాకు సంబంధించిన సమాచారాన్ని అనుబంధ కళాశాలలకు తెలిపింది. విద్యార్థి సంఘాల రాష్ట్ర వ్యాప్త బంద్ నేపథ్యంలో శు క్రవారం నాటి ఎగ్జామ్స్ గురించి విద్యార్థులు ఆందోళన చెందవద్దని.. వాయిదా పడిన పరీక్షలకు కొత్త తేదీని త్వరలోనే ప్రకటిస్తామని ఓయూ అధికారులు వెల్లడించారు. అటు.. జేఎన్‌టీయూలో సైతం శు క్రవారం జరగాల్సిన పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈ విషయాన్ని గురువారం జేఎన్‌టీయూ యాజమాన్యం వెల్లడించింది. తెలంగాణ యూనివర్సిటీ, మహాత్మ గాంధీ యూనివర్సిటీ లోనూ పరీక్షలను వాయిదా వేశారు. శుక్రవారం జరగాల్సిన పరీక్షలకు త్వరలోనే కొత్త తేదీలు ప్రకటిస్తామని అనుబంధ కాలేజీలకు టీయూ అధికారులు సమాచారమిచ్చారు. శుక్రవారం నాటి బంద్ ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ, ఏఐఎఫ్‌డీఎస్, ఏఐపీఎస్‌యూ, ఏఐఎస్‌బీల ఆధ్వర్యంలో జరగనుంది. బంద్‌లో భాగంగా శుక్రవారం ఉదయం 11:00 గంటల నుండి నారాయణ గూడ చౌరస్తా నుండి వై జంక్షన్ వరకు " విద్యార్థి ర్యాలీ " నిర్వహించనున్నారు.

# నీట్-2024 లీక్ ప్రధాన సూత్రధారికి క్లీన్ చిట్

**మొదటి పేజీ తరువాయి**

సహా మరికొందరిపై కేసు నమోదు చేశారు. అప్పట్లో పరారీలో ఉన్న సంజీవ్ కుమార్, కొందరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కానీ, ఈ వ్యవహారంపై దేశవ్యాప్తంగా ఆందోళనలు, ఆగ్రహం వ్యక్తం కావడంతో సీబీఐ దర్యాప్తునకు అప్పగించారు. దీనిపై విచారణ పూర్తిచేసి పట్నా ప్రత్యేక కోర్టులో 45 మంది నిందితులపై ఛార్జ్‌షీట్‌ను సీబీఐ దాఖలు చేసింది. కానీ, పేపర్ చోరీ లేదా పంపిణీలో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న సంజీవ్ కుమార్ పాత్రకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లభించలేదని తెలిపింది. అందుకే అతడి చార్జ్‌షీట్ దాఖలు చేయలేదని చెబుతూ క్లీన్ చిట్ ఇచ్చింది. మరోవైపు, ఈ కేసులో సంజీవ్ కుమార్‌కు క్లీన్ చిట్ ఇచ్చినప్పటికీ ఇతర కేసులలో నిందితుడిగా ఉండటంతో జ్యుడీషియల్ కస్టడీలో కొనసాగినట్లు సీబీఐ అధికారి ఒకరు తెలిపారు. నీట్ యూజీ 2024 పేపర్ లీక్ అంశంపై సమగ్ర దర్యాప్తు జరపడంతో పాటు కుట్రలో భాగస్వాములైన అందరినీ గుర్తించామని, చట్టం నుంచి వారు తప్పించుకోకుండా సీబీఐ చూసిందని అన్నారు.

# ఈ20యే ఫైనల్

**మొదటి పేజీ తరువాయి**

కంటే.. మరింత మెరుగైన, అధునాతన సాంకేతికతల వైపు పయనించడమే తమ ప్రభుత్వ విధానమని ఆయన స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో వెల్లడించిన గణాంకాల ప్రకారం.. భారత్ నిర్దేశించుకున్న 20% ఇథనాల్ బ్లెండింగ్ లక్ష్యాన్ని నిర్దేశిత గడువు కంటే ఐదేళ్ల ముందే సాధించింది. సగటు ఇథనాల్ మిశ్రమం 2022-23లో 12%గా ఉ ండగా, 2023-24 నాటికి 14.6%కి, 2024-25 నాటికి 19.2%కి పెరిగింది. 2025-26 (నవంబర్-జూన్) నాటికి తుది లక్ష్యమైన 20%కి చేరుకుందని కేంద్రం తెలిపింది. అలాగే, 85 శాతం ఇథనాల్ ఉండే ఈ85 ఇంధనాన్ని కేవలం ఫ్లెక్సి-ఫ్యూయల్ వాహనాలకు ఉద్దేశించిందని, సాధారణ పెట్రోల్ సరఫరాలో భాగం కాదని పేర్కొంది.

# 'కుశ' క్షిపణి ప్రయోగం విజయవంతం

**మొదటి పేజీ తరువాయి**

'ప్రాజెక్ట్ కుశ'లో భాగంగా భారత వాయుసేన, నౌకాదళం కోసం ఈ క్షిపణి వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న 80 కిలోమీటర్ల రేంజ్ ఎంఆర్-శామ్, 400 కిలోమీటర్ల రేంజ్ ఎస్-400 వ్యవస్థల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని 'కుశ' భర్తీ చేయనుంది. ఇప్పటికే వాయు రక్షణ వ్యవస్థలో ఉన్న బరాక్-8, ఎస్-400, ఆకాశ్ క్షిపణులకు ఇది అదనపు బలంగా నిలవనుంది. 'కుశ' క్షిపణి విజయవంతం కావడం భారత రక్షణ పరిశోధన రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఇలాంటి అత్యాధునిక క్షిపణి వ్యవస్థలను అభివృద్ధి చేయగల సామర్థ్యం కేవలం కొన్ని దేశాలకే ఉందని గుర్తుచేశారు. ఈ విజయంతో ఇలాంటి వ్యవస్థల కోసం విదేశాలపై ఆధారపడాల్సిన అవసరం తప్పుతుందని, ఇది దేశ వాయు రక్షణ సామర్థ్యంలో ఒక పెద్ద ముందడుగు అని ఆయన పేర్కొన్నారు. ఈ క్షిపణికి సంబంధించిన రాడార్లు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ సహా అన్ని భాగాలను డీఆర్‌డీఓ, దేశీయ పరిశ్రమలు కలిసి అభివృద్ధి చేశాయి. రక్షణ శాఖ కార్యదర్శి, డీఆర్‌డీఓ ఛైర్మన్ రాజేష్ కుమార్ సింగ్ ఈ ప్రయోగాన్ని పర్యవేక్షించి, శాస్త్రవేత్తల బృందాన్ని అభినందించారు.

# భర్త హత్య కేసులో భార్యకు జీవితఖైదు

**మొదటి పేజీ తరువాయి**

వాంగ్మూలం ఇచ్చింది. హత్య జరిగిన రోజు రాత్రి తన తల్లి.. తనతో పాటు తన ఇద్దరు సోదరులను ఓ గదిలో ఉంచుందని చెప్పింది. ముఖ్యంగా ఓ మొబైల్ ఫోన్, కూల్ డ్రింక్స్ ఇచ్చి బయట నుంచి తలుపులు వేసి గడియ పెట్టిందని వివరించింది. ఆ తర్వాత గది వెలుపల పెద్ద ఎత్తున గొడవ జరిగిన శబ్దాలు వినిపించాయని పేర్కొంది. నిద్రలేచి చూసేసరికి మంచంపై, గోడలపై రక్తపు మరకలు ఉన్నాయని.. అర్ధరాత్రి దాటాక తల్లి స్నానం చేయడం చూశానని చెప్పింది. అలాగే క్రమం తప్పకుండా తమ ఇంటికి వచ్చే తన తల్లి ప్రియుడు రవికాంత్, అతడి సోదరుడి గొంతులను తాను స్పష్టంగా గుర్తుపట్టానని వివరించింది. 2021 జూన్ 8వ తేదీన తాజ్‌గంజ్ ప్రాంతంలోని బాధితుడి ఇంటి సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలోనో నరేష్ కుమార్ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ముఖ్యంగా అతడి తలపై ఇటుకతో కొట్టి దారుణంగా హత్య చేసి, ఆపై గోనె సంచిలో కుక్కిన స్థితిలోనే అతడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్ట్‌మార్టం నివేదికలో బాధితుడి శరీరంలో 14 చోట్ల తీవ్ర గాయాలు అయినట్లు తేలింది. అంతకుముందు తన భార్య వివాహేతర సంబంధాన్ని వ్యతిరేకించినందుకు బెదిరింపులు వస్తున్నాయని నరేష్ కుమార్ రాష్ట్ర ఐజీఆర్ఎస్ (ఐజీఆర్ఎస్) పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తాజ్‌గంజ్ పోలీసులు హత్య, సాక్ష్యాధారాల విధ్వంసం సహా ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసులు నమోదు చేశారు. చిన్నారి సాక్ష్యంతో పాటు సాంకేతిక ఆధారాలు, చాట్ రికార్డులు, 10 మంది సాక్షుల వాంగ్మూలాలను సమగ్రంగా పరిశీలించిన కోర్టు.. ఈ ఐదేళ్ల నాటి సుదీర్ఘ పోరాటానికి ముగింపు పలుకుతూ ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు విధించింది.

# నా చావుకు మోదీయే కారణం

### సర్ ఫామ్‌పై యువకుడి సూసైడ్ నోట్



రాజన్న సిరిసిల్ల, జూలై 23 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన పిట్ల వంశీ అనే యువకుడు తన ఇంట్లో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. అయితే.. వంశీ తాను ఉరివేసుకోవడానికి ముందు రాసిన సూసైడ్ నోట్‌లో పేర్కొన్న విషయాలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తన చావుకు కేవలం ప్రధానమంత్రి నరేంద్ర మోదీనే కారణమని పేర్కొనడం తీవ్ర కలకలం రేపుతోంది. తన కుటుంబంలోని ఎవరినీ ఇబ్బంది పెట్టొద్దు అని అందులో రాయడం ఇప్పుడు చర్చకు దారి తీస్తోంది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. వంశీ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలంలో లభించిన ఆత్మహత్య లేఖను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. తన ఆత్మహత్యకు కారణం ప్రధాని మోదీ అంటూ వంశీ తన సూసైడ్ లెటర్‌లో రాసిపెట్టినా.. అతడు చనిపోవడానికి దారితీసిన అసలు కారణాలపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు.

# రెడ్కో డీజీఎంకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్

హైదరాబాద్, జూలై 23 (ఈవార్తలు): ఆదాయానికి మించి అక్రమాస్తుల కేసులో అరెస్టయిన తెలంగాణ పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ(టీజీఆర్ఈడీసీఓ) డిప్యూటీ జనరల్ మేనేజర్ ముత్యం వెంకట రమణకు ఏసీబీ కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. బుధవారం అరెస్ట్ చేసిన అధికారులు గురువారం కోర్టులో హాజరుపరచగా, కోర్టు రిమాండ్ ఆదేశాలతో చంచల్‌గూడ జైలుకు తరలించారు. 2019లో ఆర్అండ్‌బీ శాఖలో పనిచేస్తున్న సమయంలో రూ.25 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ కేసు ఇంకా విచారణలో ఉండగానే, తాజా దాడుల్లో రూ.28.14 కోట్ల విలువైన ఆదాయానికి మించిన ఆస్తులను ఏసీబీ గుర్తించినట్లు వెల్లడించింది. నమోదిత విలువ ప్రకారం ఆస్తులు రూ.28.14 కోట్లు కాగా, ఎక్కువ భాగం రియల్ ఎస్టేట్ కావడంతో మార్కెట్ విలువ రూ.200 కోట్లకు పైగా ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇది ఏసీబీ ఆరున్నర దశాబ్దాల చరిత్రలోనే అతిపెద్ద అవినీతి కేసుగా అధికారులు పేర్కొన్నారు. కొద్దిరోజుల క్రితం రిజిస్ట్రేషన్ విలువ ప్రకారమే రూ.17.94 కోట్లతో చిక్కిన ఆర్అండ్‌బీ ఈఎన్సీ మోహన్‌నాయక్ ఉదంతమే ఇప్పటివరకు రికార్డు కాగా.. తాజాగా టీజీ రెడ్కో డీజీఎం ముత్యం వెంకటరమణ ఆ రికార్డుని బద్దలు కొట్టాడం విశేషం.

# డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్ ఆత్మహత్య

హైదరాబాద్, జూలై 23 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని తెలంగాణ డీజీపీ కార్యాలయంలో ఈ ఉదయం తీవ్ర విషాదకర సంఘటన చోటుచేసుకుంది. డీజీపీ ఆఫీసులో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న స్వామి అనే కానిస్టేబుల్ తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడటం తీవ్ర కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి పూట విధుల్లో ఉన్న స్వామి, ఉదయం దాదాపు 5.30 గంటల సమయంలో వాష్‌రూమ్‌లోకి వెళ్లి తన వద్ద ఉన్న సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకున్నాడు. తీవ్ర గాయంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ఉన్నతాధికారులు కేసు నమోదు చేసుకుని ప్రాథమిక దర్యాప్తు చేపట్టారు. కానిస్టేబుల్ స్వామి రాసిన సూసైడ్ నోట్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. "నేను ఆత్మహత్య చేసుకుంటున్నాను. నా భార్య, పిల్లలను ఎవరూ ఏమీ అనొద్దు.. వాళ్లు చాలా మంచివాళ్లు. నేను చనిపోయిన తర్వాత దెయ్యంగా మారైనా సరే నా కుటుంబాన్ని, పిల్లలను జాగ్రత్తగా కాపాడుకుంటాను" అని ఆయన తన డైరీలో రాసుకున్న ఆఖరి మాటలు అందరినీ తీవ్రంగా కలిచివేస్తున్నాయి. ఈ ఘటనపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరుపుతున్నారు.



# ప్రతి చుక్కను కాపాడుకుందాం

### ఎల్‌నినోతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు

### అధికారులకు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు జారీ

హుస్నాబాద్, జూలై 23 (ఈవార్తలు): ఎల్‌నినో ప్రభావం కారణంగా తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణంలో తలెత్తిన ఈ మార్పుల దృష్ట్యా ప్రజలకు, రైతులకు నీటి ఎద్దడి రాకుండా అధికారులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ఐఓసీ కార్యాలయంలో ఎల్‌నినో ప్రభావం, తాగునీటి పరిస్థితులపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లతో పాటు హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు హాజరయ్యారు. సమీక్ష సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో తాగునీటి కొరతతో పాటు పశువులకు గ్రాసం లభించక ఇబ్బందులు ఎదురయ్యే సూచనలు ఉన్నాయని అధికారులను హెచ్చరించారు. రాబోయే జూన్ నెల వరకు వర్షాలు పడే అవకాశం తక్కువగా ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారని వెల్లడించారు. ఈ కరవు పరిస్థితులను తట్టుకోవాలంటే రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటలు వేసేలా అధికారులు వారికి పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని సూచించారు. మరోవైపు రాష్ట్రంలో రోజురోజుకూ పడిపోతున్న భూగర్భ జలమట్టాలను మళ్లీ పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందడుగు వేయాలని పొన్నం తెలిపారు. 'వీబీజీ రాంజీ' ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుకుని ప్రతి ఊరిలో పెద్ద ఎత్తున ఇంకుడు గుంతల తవ్వకాలు చేపట్టాలని, పడిన ప్రతి వర్షపు బొట్టునూ వృథా కాకుండా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అధికారులు ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా, పారదర్శకంగా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళుతూ నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

# రాష్ట్రంలో పవర్ కట్ లేదు

### ఏడు వేల మెగావాట్ల అదనపు భారం

### ఎల్ నినో సవాలును అధిగమిస్తున్నాం

### 16,500 మెగావాట్ల పీక్ డిమాండ్

### రూ.56 కోట్లతో విద్యుత్ అభివృద్ధి పనులు

### డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



హైదరాబాద్, జూలై 23 (ఈవార్తలు): రాష్ట్రంలో వర్షాకాలంలో సైతం ఒకేసారి సుమారు ఏడువేల మెగావాట్ల అదనపు భారాన్ని రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ అత్యంత సమర్థవంతంగా ఎదుర్కొందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. 'ఎల్ నినో' ప్రతికూల ప్రభావంతో వర్షాకాలంలోనూ వేసవిని తలపించే స్థాయిలో విద్యుత్ డిమాండ్ పెరగడం, మరోవైపు జలాశయాల్లో నీటి లభ్యత తగ్గిపోవడంతో జలవిద్యుత్ ఉత్పత్తి గణనీయంగా పడిపోయిందని చెప్పారు. అయినా ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించామన్నారు. బుధవారం హనుమకొండలో టీజీఎన్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో రూ.56 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు విద్యుత్ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా వర్షాకాలంలో 11 వేల మెగావాట్లుగా ఉండే విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా 16,500 మెగావాట్లకు పెరగడం, మరోవైపు జలవిద్యుత్ ఉత్పత్తి 2,000 మెగావాట్లు తగ్గిపోవడం విద్యుత్ పంపిణీ వ్యవస్థపై తీవ్రమైన ఒత్తిడి సృష్టించినప్పటికీ ముందస్తు ప్రణాళికలతో ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేశామని తెలిపారు. ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని కాళేశ్వరం, దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాలు, వర్షాభావం కారణంగా రైతులు అధికంగా బోరుబావులను వినియోగించడం వల్ల పెరిగిన విద్యుత్ అవసరాలను కూడా ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించిందన్నారు. రాష్ట్రంలో 'పవర్ కట్' అనే పరిస్థితి లేదని, ప్రకృతి వైపరీత్యాల వల్ల విద్యుత్ స్తంభాలు, లైన్లు దెబ్బతిన్నప్పుడు మాత్రమే తాత్కాలిక అంతరాయం ఏర్పడుతుందని, దానిని పవర్ కట్‌గా భావించవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందుతున్న 53 లక్షల కుటుంబాల విద్యుత్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం డిస్కంలకు చెల్లిస్తోందని, రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఏటా రూ.14 వేల కోట్ల సబ్సిడీని కూడా ప్రభుత్వం విడుదల చేస్తోందని మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సమీక్ష సమావేశంలో టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంస్థ పనితీరును వివరించారు. 2023 డిసెంబర్ నుంచి 2026 జూన్ వరకు 70 కొత్త 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలు, 31,448 కిలోమీటర్ల కొత్త విద్యుత్ లైన్లు, 35,736 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్‌లు) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే కాలంలో 7.72 లక్షల కొత్త ఎల్టీ కనెక్షన్లు, 771 హెచ్‌టీ కనెక్షన్లు విడుదల చేయగా, 1,656 గ్రామాలు, 11.16 లక్షలకు పైగా వినియోగదారులు ప్రత్యక్షంగా లబ్ధి పొందినట్లు వెల్లడించారు.

# కొత్త చేయూత పెన్షన్లు!

### వేగంగా లబ్ధిదారుల ఫేస్ రికగ్నిషన్ సర్వే.. ఈ నెలాఖరు తుది గడువు.. సెర్ప్‌కు ఆదేశాలు

హైదరాబాద్, జూలై 23 (ఈవార్తలు): తెలంగాణలో సంక్షేమ పథకాల పారదర్శక అమలే లక్ష్యంగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. చేయూత పెన్షన్ పథకం లబ్ధిదారులకు సంబంధించి గత కొన్ని నెలలుగా కొనసాగుతున్న లైవ్ అథెంటిఫికేషన్ ముఖ గుర్తింపు సర్వేను ఈ నెలాఖరు నాటికి అత్యంత వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థను ప్రభుత్వం ఆదేశించింది. ఈ సర్వేకు సంబంధించిన పూర్తి వివరాలు, సమగ్ర నివేదికను రూపొందించి ఆగస్టు 5 నాటికి ప్రభుత్వానికి సమర్పించాలని స్పష్టమైన సూచనలు జారీ చేసింది. ఆగస్టు 15వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన కొత్త లబ్ధిదారులకు పెన్షన్లు మంజూరు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీనికి ముందస్తు చర్యల్లో భాగంగానే ఈ తాజా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం పింఛను పొందుతున్నవారిలో అనర్హులను, మరణించిన వారిని అలాగే నిబంధనలకు విరుద్ధంగా లబ్ధి పొందుతున్న వారిని గుర్తించి జాబితా నుంచి తొలగించాలని ఆదేశించడంతో గత మూడు నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయి సర్వే సాగుతోంది. సెర్ప్ ఇప్పటివరకు నిర్వహించిన ముఖ గుర్తింపు నమోదు సర్వేలో ప్రాథమికంగా 1,21,229 మందిని అనర్హులుగా అధికారులు గుర్తించారు. రాబోయే రోజుల్లో వీరి వివరాలను పరిశీలించి పూర్తి స్థాయి తొలగింపు చర్యలు చేపడతారు. మరోవైపు.. కొత్తగా పెన్షన్లు పొందడానికి రాష్ట్ర వ్యాప్తంగా సుమారు పది లక్షల మందికి పైగా అర్హులైన వారు ఇప్పటికే ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ సమగ్ర తనిఖీల నేపథ్యంలో మరో ఆసక్తికర అంశం వెలుగులోకి వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1157 మంది తమకు పెన్షన్లు వద్దంటూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి లబ్ధిదారుల జాబితా నుంచి పేర్లను తొలగించుకున్నారు. జిల్లాల వారీగా పరిశీలిస్తే నాగర్‌కర్నూల్ జిల్లాలో అత్యధికంగా 156 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 156 మంది తమ పెన్షన్లను వదులుకున్నారు. అలాగే ఖమ్మంలో 130 మంది, పెద్దపల్లిలో 90, మెదక్‌లో 83, సంగారెడ్డిలో 67, జగిత్యాలలో 64, రాజన్న సిరిసిల్లలో 55, సిద్దిపేటలో 44, రంగారెడ్డి, కరీంనగర్ జిల్లాల్లో చెరో 39 మంది చొప్పున తమ పింఛన్లను వదులుకోగా.. ములుగు మినహా మిగిలిన అన్ని జిల్లాల్లోనూ పలువురు స్వచ్ఛందంగా తమ హక్కును వదులుకోవడం విశేషం.

# ఆర్మీ భూముల్లోకి వెళ్తే సంకెళ్లు

### హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం







హైదరాబాద్, జూలై 23 (ఈవార్తలు): సికింద్రాబాద్‌లోని లోతుకుంట ఆర్మీ భూముల వివాదంలో హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ ( హైడ్రా ) అధికారుల తీరుపై తెలంగాణ హైకోర్టు మరోసారి తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. కోర్టు అనుమతి లేకుండా ఆర్మీ భూముల్లోకి మళ్లీ ప్రవేశిస్తే హైడ్రా అధికారులను వెంటనే అదుపులోకి తీసుకోవాలని.. అవసరమైతే వారికి సంకెళ్లు కూడా వేయాలని ఆర్మీ అధికారులకు తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. లోతుకుంట భూములపై గురువారం జరిగిన విచారణలో ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. వివాదాస్పద భూముల్లో హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ ఎవరైనా ప్రవేశిస్తే చట్టప్రకారం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ఈ అంశంపై పలుమార్లు హెచ్చరించినప్పటికీ.. హైడ్రా అధికారుల వైఖరిలో మార్పు కనిపించకపోవడంతో ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వ్యవహారశైలిపైనా తెలంగాణ హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తే కోర్టు ధిక్కరణ చర్యలు తప్పవని హెచ్చరించింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే సంబంధిత అధికారులను ఆర్మీ కస్టడీకి అప్పగించడానికీ వెనుకాడబోమని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. వివాదాస్పద భూముల వద్ద శాంతిభద్రతలు పరిరక్షించేందుకు ఆర్మీ బలగాలను మోహరించాలని.. కనీసం 10 మంది జవాన్లతో భద్రత ఏర్పాటు చేయాలని ధర్మాసనం సూచించింది. కోర్టు స్టే ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ హైడ్రా అధికారులు అక్కడికి వస్తే వారిని అదుపులోకి తీసుకోవడంతో పాటు వారు ఉపయోగించే అధికారిక వాహనాలను కూడా స్వాధీనం చేసుకోవాలని స్పష్టం చేసింది. ఈ కేసులో పిటిషనర్ తరపు లాయర్.. హైడ్రా అధికారులు మళ్లీ వాహనాలతో వివాదాస్పద భూముల వద్దకు వచ్చినట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే హైడ్రా తరఫున అడ్వకేట్ జనరల్ అధికారులు భూముల్లోకి ప్రవేశించలేదని కోర్టుకు తెలిపారు. దీనిపై అఫిడవిట్ దాఖలు చేయాలని ఏజీని ఆదేశించిన హైకోర్టు.. తదుపరి విచారణను వాయిదా వేసింది.

# టెక్ మహీంద్రా ముందు ఉద్యోగిని ధర్నా

మేడ్చల్, జూలై 23 (ఈవార్తలు): మేడ్చల్‌లోని టెక్ మహీంద్రా కంపెనీ ముందు ఉద్యోగిని ధర్నా సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. తనను అకారణంగా జాబ్‌లో నుంచి తీసివేశారని, తనకు ఆరోగ్యం బాగలేక 13రోజులు, పాపకు ఆరోగ్యం బాగాలేదని 3 రోజులు సెలవు కావాలని కోరితే ఉద్యోగం నుంచి తీసేశారని సాఫ్ట్ వేర్ ఉద్యోగిని భావన ఆవేదన వ్యక్తం చేస్తూ న్యాయం చేయాలంటూ నిరసనకు దిగింది. ఆరోగ్యం బాగాలేక కంపెనీలో పడిపోతే కనీసం పట్టించుకోలేదని, 14 రోజులు ట్రీట్‌మెంట్ తీసుకుంటే ఆ సమయంలో కూడా ఉద్యోగంలో నుంచి తీసేస్తామని బెదిరించారని భావన ఆరోపించింది. ఆఫీస్ లో వాష్ రూమ్ కు వెళ్లాలన్న అనుమతి తీసుకోవాలని నిబంధనలు పెట్టారని తెలిపారు. నా అనారోగ్యానికి సంబంధించిన చికిత్స, నా కూతురు అందించిన చికిత్సకు సంబంధించి అన్ని డాక్యుమెంట్లు కంపెనీ అధికారులు సమర్పించినప్పటికి నన్ను ఉద్దేశపూర్వకంగానే జాబ్‌లో నుంచి తీసేశారని భావన ఆరోపించింది. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తనకు న్యాయం కావాలని కంపెనీ ముందు ధర్నాకు దిగారు. ఫ్యామిలీ ఉండే మహిళా ఉద్యోగినిల పట్ల కంపెనీలు ఇంత కఠినంగా ఉండకూడదని ఆమె అభ్యర్థించారు. ఈ కంపెనీ అధికారులు నాతో వ్యవహరించినట్లుగా మరొకరి పట్ల వ్యవహరించకూడదని నేను పోరాటం చేస్తున్నట్లుగా ఆమె ప్రకటించారు. నన్ను అక్రమంగా జాబ్ లో నుంచి తీసేసిన అధికారులపై కంపెనీ యాజమాన్యం చర్యలు తీసుకునేంతవరకు ఇక్కడి నుంచి కదలనని స్పష్టం చేశారు. భావన నిరసనకు నెటిజన్లు భారీగా మద్దతు పలుకుతున్నారు.

# తిరుపతి-చెన్నై హైవేకు రూ.680 కోట్లు

సత్యసాయి జిల్లా, జూలై 23 (ఈవార్తలు): ఏపీకి కేంద్ర ప్రభుత్వం మరో కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. శ్రీ సత్యసాయి జిల్లాలోని ముదిగుబ్బ నుంచి కదిరి వరకు ఉన్న జాతీయ రహదారి-42 (ఎన్‌హెచ్-42) విస్తరణ.. బలోపేతానికి రూ.679.71 కోట్లను కేంద్ర ప్రభుత్వం ఆమోదించినట్లు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తాజాగా ఎక్స్ వేదికగా ప్రకటించారు. ప్రస్తుతం రెండు లేన్లుగా ఉన్న ఈ ముదిగుబ్బ-కదిరి జాతీయ రహదారిని పేవ్డ్ షోల్డర్లతో కూడిన 4 లేన్ల నేషనల్ హైవేగా అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలతో పాటు కర్ణాటక సరిహద్దు ప్రాంతాల ప్రజలకు ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారనుంది. ఈ రహదారి ద్వారా బెంగళూరు-విజయవాడ-కోల్‌కతా ఎక్స్‌ప్రెస్‌వేతోపాటు.. తిరుపతి, చెన్నై నగరాలకు వేగవంతమైన అనుసంధానం లభించనుంది. దీంతో ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా సరుకు రవాణా మరింత వేగంగా సాగి రవాణా వ్యయాలు కూడా తగ్గే అవకాశం ఉంది. అలాగే రహదారిపై ట్రాఫిక్ రద్దీ తగ్గి ప్రాంతీయ వాణిజ్యం, లాజిస్టిక్స్ రంగానికి ఊతమిస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

# 3,168 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్

అమరావతి, జూలై 23 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్తగా 3,168 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం 25కు పైగా అజెండాలోని అంశాలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అందులో 3,168 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే చేనేత కార్మికులకు నేతన్న భరోసా కింద రూ.25వేలు చొప్పున ఆర్థికసాయం, బాపట్లలో వినికిడిలోపం ఉన్న విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు, పుష్కరాలకు భద్రత, బందోబస్తుకు రూ.50 కోట్లు మంజూరుకు నిర్ణయం తీసుకుంది. ఏపీ మార్క్‌ఫెడ్‌కు సెంట్రల్‌బ్యాంకు నుంచి ఇచ్చే రూ.300 కోట్ల రుణానికి ప్రభుత్వం గ్యారెంటీ ఉండేందుకు అంగీకరిస్తూ కేబినెట్ నిర్ణయించింది.

# సీదిరి అప్పలరాజుకు 14 రోజుల రిమాండ్

శ్రీకాకుళం, జూలై 23 (ఈవార్తలు): వైసీపీ నేత, ఏపీ మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుకు పలాస కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. రోడ్డు ప్రమాదం కేసులో తన కుమారుడిని రక్షించేందుకు ప్రయత్నించారన్న తీవ్ర ఆరోపణలపై పోలీసులు ఆయన్ను బుధవారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. గురువారం కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే, ఇటీవల అప్పలరాజు కుమారుడు ఆరవ్ నడిపిన బైక్ ఢీకొని దానయ్య అనే గొర్రెల కాపరి మృతి చెందాడు. ఈ కేసులో తన 18 ఏళ్ల కుమారుడిని కాపాడేందుకు అప్పలరాజు ప్రయత్నించారని పోలీసులు ఆరోపించారు. ప్రమాదానికి కారణమైన తన కుమారుడి స్థానంలో సిద్ధార్థ్ అనే మరో కుర్రాడిని నిందితుడిగా చిత్రీకరించేందుకు ఆయన యత్నించారని అభియోగాలు నమోదు చేశారు. అంతేకాకుండా, మృతుడి కుటుంబాన్ని డబ్బుతో ప్రలోభపెట్టాలని చూశారని, కేసుకు సంబంధించిన కీలక సాక్ష్యాధారాలను తారుమారు చేసి దర్యాప్తును తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించారని పోలీసులు తమ రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. బుధవారం అరెస్ట్ చేసిన తర్వాత, గురువారం పలాస జీజీహెచ్ లో అప్పలరాజుకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పలాస కోర్టులో ప్రవేశపెట్టారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి, అప్పలరాజుకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కోర్టు ఆదేశాలతో అధికారులు ఆయన్ను అంపోలు జైలుకు తరలించారు.

# తిరుమలలో ఎయిర్‌పోర్ట్ రేంజ్‌లో లాంజ్

తిరుమల, జూలై 23 (ఈవార్తలు): తిరుమలలో శ్రీవాణి దర్శన టికెట్లు తీసుకున్న భక్తులు వేచి ఉండేందుకు ఎయిర్‌పోర్టు మాదిరిగా లాంజ్ నిర్మించాలని టీటీడీ ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ఈ లాంజ్ నిర్మాణం కోసం కొండపై స్థలాన్ని గుర్తించే పనిలో ఉన్నారు. ప్రాథమిక సమాచారం మేరకు తిరుమలలోని అన్నమయ్య భవనానికి సమీపంలో న్యూ ఉడ్‌సైడ్ హోటల్ ఉంది.. ఆ ప్రాంగణాన్ని శ్రీవాణి భక్తులకు లాంజ్‌లా మార్చాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో అక్కడ ఉడ్‌సైడ్ హోటల్ ఉండేది.. ఆ తర్వాత తీసేయడంతో ఆ భవనం ఖాళీగా ఉంది. అందుకే అక్కడ లాంజ్ ఏర్పాటు చేస్తే బావుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నట్లు సమాచారం.

Page-4_Layout 1 7/24/2026 5:15 AM Page 1






## నేడు జగిత్యాలలో విద్యాసంస్థల బంద్

జగిత్యాల, జూలై 23 (ఈవార్తలు): నీట్ ప్రశ్నపత్రం లీక్ ఘటనకు నిరసనగా శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల బంద్‌కు కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ పిలుపునిచ్చాయి. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గాజంగి నందయ్య ఆధ్వర్యంలో, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు చెట్టే భార్గవ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీరం రాజేష్ నాయకత్వంలో ఈ బంద్ నిర్వహించనున్నట్లు గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు, విద్యార్థులు బంద్‌కు సహకరించి విజయవంతం చేయాలని కోరారు. ప్రజాస్వామ్యబద్ధంగా చేపట్టనున్న ఈ కార్యక్రమానికి అన్ని విద్యాసంస్థలు సంఘీభావం తెలపాలని విజ్ఞప్తి చేశారు. బంద్ సందర్భంగా శాంతియుతంగా వ్యవహరించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు కోరారు.




## ఎస్ఐఆర్ ఫారాలు వెంటనే సమర్పించాలి

### ఓటర్లకు అబ్దుల్ ఖయ్యూమ్ (టిల్లు) విజ్ఞప్తి

జగిత్యాల టౌన్, జూలై 23 (ఈవార్తలు): జగిత్యాల పట్టణం 34వ వార్డు పరిధిలోని పోలింగ్ స్టేషన్ నంబర్ 203లో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను కో-ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్ ముజాహిద్ (ముజ్జు), 34వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అబ్దుల్ ఖయ్యూమ్ (టిల్లు) గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డు పౌరుల ఎస్ఐఆర్ దరఖాస్తులను సమర్పించారు. పోలింగ్ స్టేషన్ పరిధిలో ఇప్పటివరకు ఎస్ఐఆర్ ప్రక్రియ 73 శాతం పూర్తయిందని బీఎల్‌వో సీహెచ్ లక్ష్మి తెలిపారు. మిగిలిన ప్రక్రియను త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. ఎస్ఐఆర్ దరఖాస్తులు ఇంకా సమర్పించని 34వ వార్డు ఓటర్లు ఎలాంటి ఆలస్యం చేయకుండా వెంటనే దరఖాస్తులను సమర్పించాలని అబ్దుల్ ఖాదర్ ముజాహిద్, అబ్దుల్ ఖయ్యూమ్ విజ్ఞప్తి చేశారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసి ఓటరు జాబితాలో తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రక్రియను విజయవంతంగా నిర్వహిస్తున్న బీఎల్‌వోలు, సిబ్బంది, స్వచ్ఛంద సేవకులను అభినందించారు. 34వ వార్డులో ఎస్ఐఆర్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేసేందుకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఎల్‌వో సీహెచ్ లక్ష్మి, అతర్, మతీన్, ఫైజాన్, బబ్బుల్‌తో పాటు టీమ్ ఈద్గా సుల్తాన్ యూత్, రహమత్‌పురా సభ్యులు పాల్గొన్నారు.



## మాజీ సర్పంచ్‌కు బీఆర్ఎస్ నేతల చేయూత

కరీంనగర్, జూలై 23 (ఈవార్తలు): తిరుమలాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చెట్టుపల్లి హరేందర్ తీవ్ర అనారోగ్యంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం కొడిమ్యాల మండల బీఆర్ఎస్ నాయకులు రూ.52 వేల ఆర్థిక సాయం అందజేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ 50వ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో భాగంగా ఈ మొత్తాన్ని హరేందర్ భార్యకు అందించారు. కార్యక్రమంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ నాయకులు పునుగోటి కృష్ణారావు, పులి వెంకటేష్‌గౌడ్, పోలు రాజేందర్, ఆకునూరి మల్లయ్య, ఎండ్రికాయల శ్రీనివాస్, కోలకాని సత్యం, శంకర్‌నాయక్, బల్కం మల్లేశం యాదవ్, గంగుల మల్లేశం యాదవ్, శేఖర్, బసనవేని మహేష్, ధర్మపురి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ లీకేజీపై సమగ్ర దర్యాప్తు చేయాలి

### బీఆర్ఎస్ నేత దావ వసంత సురేష్

జగిత్యాల, జూలై 23 (ఈవార్తలు): ఢిల్లీలో శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులు, యువతపై లాఠీచార్జి చేయడాన్ని జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ తీవ్రంగా ఖండించారు. నీట్ పేపర్ లీకేజీ వంటి అత్యంత తీవ్రమైన అంశంపై బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రాజకీయ నాటకాలు మానుకుని విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీకేజీతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. ఎన్నో సంవత్సరాలు కష్టపడి చదివిన విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు అండగా నిలవాల్సిన కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉండగా, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పరస్పరం విమర్శలు చేసుకుంటూ రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నించడం సరికాదన్నారు. ఢిల్లీలో రాహుల్‌గాంధీ నిరసనలు, తెలంగాణలో కాంగ్రెస్ నాయకుల ధర్నాలు, మరోవైపు బీజేపీ కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం తప్ప విద్యార్థులకు న్యాయం ఎలా చేయాలనే అంశంపై స్పష్టమైన చర్యలు కనిపించడం లేదన్నారు. పరీక్షల నిర్వహణలో జరుగుతున్న అవకతవకలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర, పారదర్శక దర్యాప్తు జరిపి బాధ్యులెవరైనా కఠినంగా శిక్షించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో పటిష్ఠమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పరస్పర విమర్శలు, రాజకీయ ఆరోపణలు మానుకుని విద్యార్థుల భవిష్యత్తు కోసం పనిచేయాలని దావ వసంత సురేష్ సూచించారు. విద్యార్థుల భవిష్యత్తే దేశ భవిష్యత్తని, బీఆర్ఎస్ పార్టీ విద్యార్థుల హక్కుల కోసం ప్రజల గొంతుకగా నిరంతరం పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు అయిల్నేని వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు వొళ్లెం మల్లేశం, నాయకులు కచ్చు హరీష్, జంగిలి అనిల్, తాడేపు మహేష్, ఆరుముల్ల మానస, శివకుమార్, భాగ్య, జమున తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు క్రీడలు జాతీయ ఐక్యతకు ప్రతీక

## కేంద్ర మంత్రి బండి సంజయ్ వెల్లడి.. అఖిల భారత పోలీసు జూడో క్లస్టర్ ప్రారంభం

హైదరాబాద్, జూలై 23 (పీఐబీ): గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 11వ అఖిల భారత పోలీసు జూడో క్లస్టర్-2026 పోటీలను కేంద్ర హోం వ్యవహారాల సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలు దేశ నిర్మాణానికి, యువత సాధికారతకు కీలక సాధనమని అన్నారు. ఖేలో ఇండియా, ఆసియా క్రీడలు, ప్రపంచ పోలీసు-అగ్నిమాపక క్రీడలు వంటి కార్యక్రమాల ద్వారా కేంద్ర ప్రభుత్వం క్రీడా మౌలిక వసతులను బలోపేతం చేస్తోందని తెలిపారు. క్రీడల బడ్జెట్‌ను రూ.4,480 కోట్లకు పెంచినట్లు వెల్లడించారు. పోలీసు క్రీడలు దేశవ్యాప్తంగా ఉన్న భద్రతా బలగాల సిబ్బందిని ఒకే వేదికపైకి తీసుకువచ్చి స్నేహభావం, పరస్పర అవగాహన, జాతీయ ఐక్యతను పెంపొందిస్తాయని బండి సంజయ్ పేర్కొన్నారు. మహిళల భాగస్వామ్యం పెరగడం సమ్మిళితాభివృద్ధికి నిదర్శనమన్నారు. దేశ భద్రతలో సీఐఎస్ఎఫ్ కీలక పాత్ర పోషిస్తోందని, విమానాశ్రయాలు, పార్లమెంట్, ఢిల్లీ మెట్రో, అణు, అంతరిక్ష సంస్థలు వంటి అత్యంత కీలక ప్రాంతాలకు భద్రత కల్పిస్తోందని ఆయన వివరించారు. ఇటీవల ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో సీఐఎస్ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ అభిమన్యు స్వర్ణ పతకం సాధించడం దళానికి గర్వకారణమని పేర్కొన్నారు. అథ్లెట్లకు అదనపు ఆర్థిక సహాయం, నాణ్యమైన పోషకాహారం, ఆధునిక క్రీడా సామగ్రి వంటి సంక్షేమ చర్యలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ ఏడీజీ (సౌత్) పద్మాకర్ ఎస్. రనపిసే, ఐజీ ఎస్.ఆర్. శరవణన్, ఎన్ఐఎస్ఏ డైరెక్టర్ హర్‌ప్రీత్ కౌర్ సోహి, పీఐబీ ఏడీజీ శ్రుతి పాటిల్ తదితరులు పాల్గొన్నారు. జూలై 23 నుంచి 30 వరకు జరిగే ఈ పోటీల్లో 36 రాష్ట్ర పోలీసు విభాగాలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలకు చెందిన 1,600 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటున్నారు. జూడోతో పాటు వుషు, తైక్వాండో, కరాటే, పెన్కాక్ సిలాట్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు.




# కాళేశ్వరంపై విషప్రచారం

## కేసీఆర్‌పై ఈర్ష్య, ద్వేషంతోనే కాంగ్రెస్ నేతల తీరు.. మాజీ మంత్రి జీవన్‌రెడ్డి ధ్వజం

జగిత్యాల, జూలై 23 (ఈవార్తలు): మాజీ సీఎం కేసీఆర్‌పై ఈర్ష్య, ద్వేషంతోనే కాంగ్రెస్ నాయకులు కాళేశ్వరం ప్రాజెక్టుపై విషప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి.జీవన్‌రెడ్డి ఆరోపించారు. కరువు పరిస్థితుల్లో ప్రజలను, రైతులను ఆదుకునే చర్యలపై దృష్టి పెట్టకుండా సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ కోణంలో ఆలోచిస్తున్నారని విమర్శించారు. గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జగిత్యాల జిల్లా పరిషత్ తొలి మాజీ ఛైర్‌పర్సన్ దావ వసంత సురేష్‌తో కలిసి జీవన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఎల్‌నినో ప్రభావంతో తల్లడిల్లుతున్న సమయంలో పరిస్థితిని ఎలా అధిగమించాలనే దానిపై ఆలోచించకుండా సీఎం రాజకీయ కోణంలో వ్యవహరిస్తున్నారని అన్నారు. కరువు వచ్చినప్పుడు ప్రాణహిత నది జలాలను వినియోగించుకునేలా కేసీఆర్ దూరదృష్టితో మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం చేపట్టారని తెలిపారు. కుంగిన పిల్లర్లకు మరమ్మతులు చేయించడం ప్రభుత్వ కనీస బాధ్యత అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి కుట్రపూరితంగా విషప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద 93.5 మీటర్ల నీటిమట్టం ఉంటే నీటిని ఎత్తిపోయవచ్చని సాంకేతిక నిపుణులు, నీటిపారుదల శాఖ ఇంజినీర్లు సూచించినట్లు తెలిపారు. కేటీఆర్ బాధ్యతగల నాయకుడిగా కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించి ప్రభుత్వానికి సూచనలు చేస్తే, వాటిని సానుకూలంగా తీసుకోవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. నీట్ పేపర్ లీక్‌పై ఉద్యమిస్తున్న వారిపై లాఠీచార్జికి నిరసనగా కేటీఆర్ తన పుట్టినరోజు వేడుకలను రద్దు చేసుకుని ధర్నా చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం క్రాప్ హాలిడే ప్రకటించి రైతులకు ఎకరాకు రూ.20 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర్‌రావు, దుర్గయ్య, జున్ను రాజేందర్, శీలం ప్రవీణ్, గాజుల రాజేందర్, వొల్లెం మల్లేశం, శీలం సురేందర్, పుప్పాల అశోక్, రాధాకిషన్, నక్క జీవన్, మల్లారెడ్డి, కచ్చు హరీష్, సుధాకర్, గంగారాం, మహిపాల్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.




## సీఎం సహాయనిధితో 2.50 లక్షల సాయం

### జానయ్య చికిత్సకు ఎమ్మెల్యే సంజయ్ ఆర్థిక భరోసా

రాయికల్, జూలై 23 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా శ్రీరాంనగర్ గ్రామానికి చెందిన కొంపెల్లి జానయ్యకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని అందజేశారు. జానయ్య తలలో కణతి ఏర్పడి చికిత్స పొందుతున్న విషయం స్థానిక సర్పంచ్ తాళ్లపల్లి రాధిక శ్రీరామ్‌గౌడ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే సీఎం సహాయనిధి ద్వారా ఆర్థికసాయం మంజూరు చేయించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జానయ్యకు ఎల్‌ఓసీని అందజేశారు. ఈ సందర్భంగా జానయ్య కుటుంబసభ్యులు, గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్టీసీ విలీన ప్రక్రియను పూర్తి చేయాలి

### మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జగిత్యాల, జూలై 23 (ఈవార్తలు): ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి. జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని తన నివాసంలో గురువారం ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని విజయవంతంగా అమలు చేయడంలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. దశాబ్దాల పాటు సంస్థ అభివృద్ధికి సేవలందించిన ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం పొందాల్సిన పీఆర్సీ, డీఏ, పెన్షన్ తదితర ప్రయోజనాలు అందకపోవడం విచారకరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లుకు శాసనసభ, శాసన మండలి ఆమోదం లభించడంతో పాటు గవర్నర్ కూడా ఆమోదం తెలిపారని గుర్తు చేశారు. అయితే ఎన్నికల కారణంగా అపాయింటెడ్ డే ప్రకటించలేకపోయారని చెప్పారు. ఆ రోజు ప్రకటించి ఉంటే ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, పెన్షన్, ఇతర సేవా ప్రయోజనాలు లభించేవని అన్నారు. ఇటీవల ఆర్టీసీ ఉద్యోగులు సమ్మె చేపట్టగా త్వరలో అపాయింటెడ్ డే ప్రకటిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి సమ్మెను విరమింపజేసిందని, ఇప్పుడు మాత్రం యూనియన్ ఎన్నికల తర్వాతే అపాయింటెడ్ డే ప్రకటిస్తామని చెప్పడం సరైన విధానం కాదని విమర్శించారు. విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగుల్లో ఎక్కువ మంది వృద్ధులేనని, వారికి తగిన పెన్షన్, ఉచిత వైద్య సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే అపాయింటెడ్ డే ప్రకటించి ఆర్టీసీ విలీన ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు వచ్చినా తాను అండగా ఉంటానని, వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఆగస్టు 4న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, తాను కూడా పాల్గొనేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు.

# రాహుల్‌కు సంఘీభావంగా కాంగ్రెస్ నిరసన

### కేంద్ర ప్రభుత్వ తీరుపై వేములవాడలో ఆందోళన

వేములవాడ అర్బన్, జూలై 23 (ఈవార్తలు): టీపీసీసీ పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి సంఘీభావంగా వేములవాడ తిప్పాపురంలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూమ్ మధు, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పాల్గొని మీడియాతో మాట్లాడారు. ఢిల్లీలో ఇటీవల జరిగిన నిరసన సందర్భంగా రాహుల్ గాంధీపై జరిగిన దాడి ప్రజాస్వామ్య చరిత్రలో దురదృష్టకర సంఘటన అని విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడికి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసే హక్కు ఉందని, ఆ హక్కును కాలరాయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. రాహుల్ గాంధీపై జరిగిన దాడి ఒక వ్యక్తిపై కాదు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. నెహ్రూ-గాంధీ కుటుంబం దేశ నిర్మాణంలో చేసిన సేవలను గుర్తు చేస్తూ, రైతులు, యువత, మహిళలు, నిరుద్యోగులు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం రాహుల్ గాంధీ నిరంతరం పోరాడుతున్నారని కొనియాడారు. ప్రతిపక్ష స్వరాన్ని అణచివేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించిన వారు, ప్రజాస్వామ్యాన్ని ఎవరూ అణచలేరని, సత్యాన్ని దాచలేరని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, లౌకిక విలువల పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, రాహుల్ గాంధీ పోరాటానికి వేములవాడ ప్రజల తరఫున పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# 'ఎస్ఐఆర్'లో పాల్గొన్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి, జూలై 23 (ఈవార్తలు): కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మెట్‌పల్లిలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాన్ని నింపి ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితా అత్యంత కీలకమన్నారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో సక్రమంగా నమోదు కావడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. ప్రతి కుటుంబం తమ ఇళ్లకు వచ్చే బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ)కు అవసరమైన పత్రాలు, వివరాలు అందించి ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేయాలని కోరారు. ఓటరు జాబితాలో తమ పేరు, చిరునామా, వయస్సు తదితర వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. ఏవైనా తప్పులు లేదా వివరాల్లో మార్పులు ఉంటే వెంటనే సవరించుకోవాలని తెలిపారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కుకు దూరం కాకుండా ప్రతి ఒక్కరూ ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ప్రతి ఓటరు భాగస్వామి కావాలని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కోరారు.




# అనుమానాస్పదులకు లాడ్జ్ గదులు ఇవ్వొద్దు

### జగిత్యాల టౌన్ సీఐ కరుణాకర్

జగిత్యాల టౌన్, జూలై 23 (ఈవార్తలు): పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు టౌన్ సీఐ కరుణాకర్ గురువారం పట్టణంలోని లాడ్జీలను తనిఖీ చేశారు. లాడ్జి నిర్వాహకులకు భద్రతా నిబంధనలు, పాటించాల్సిన మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు. లాడ్జీల్లో బసకు వచ్చే ప్రతి వ్యక్తి నుంచి ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు గుర్తింపు కార్డు, పాస్‌పోర్టు తదితర చెల్లుబాటయ్యే గుర్తింపు పత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలని సీఐ సూచించారు. వాటి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసిన తర్వాతే గదులు కేటాయించాలని తెలిపారు. గుర్తింపు వివరాలు లేని వారు, అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులు లేదా అనుమానాస్పద ప్రవర్తన కలిగిన వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ గదులు ఇవ్వవద్దని ఆదేశించారు. అలాంటి వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. లాడ్జీల ప్రవేశ ద్వారాలు, రిసెప్షన్, పార్కింగ్ ప్రాంతాలు, కారిడార్లు తదితర కీలక ప్రదేశాల్లో నాణ్యమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, అవి నిరంతరం పనిచేసేలా చూడాలని తెలిపారు. సీసీ కెమెరాల ఫుటేజీని నిర్దేశిత కాలం పాటు భద్రపరచి, అవసరమైనప్పుడు పోలీసులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. లాడ్జీల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలు, మాదకద్రవ్యాల వినియోగం, వ్యభిచారం లేదా ఇతర నేర కార్యకలాపాలకు అవకాశం కల్పిస్తే సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు లాడ్జీ నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని, ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. తనిఖీల్లో టౌన్ ఎస్సై సుప్రియ పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# కేటీఆర్ నిర్ణయం అభినందనీయం: నవీన్ పటేల్



హైదరాబాద్, జూలై 23 (ఈవార్తలు): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్)కు న్యాయవాది, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నవీన్ పటేల్ పత్రికాముఖంగా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఢిల్లీలో విద్యార్థులు, యువతపై జరిగిన దాడులు, రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురవక రైతాంగం ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులు వంటి పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా విషాదకర వాతావరణం నెలకొన్నదన్నారు. అలాంటి పరిస్థితుల్లో తన 50వ జన్మదిన వేడుకలను నిర్వహించకూడదని కేటీఆర్ తీసుకున్న నిర్ణయం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలకు ప్రాధాన్యం ఇస్తూ వ్యక్తిగత వేడుకలకు దూరంగా ఉండాలన్న కేటీఆర్ నిర్ణయం బాధ్యతాయుత రాజకీయ నాయకత్వానికి నిదర్శనమని నవీన్ పటేల్ అన్నారు. ప్రజా సంక్షేమమే ముఖ్యమనే సందేశాన్ని ఆయన నిర్ణయం సమాజానికి అందిస్తోందని అభిప్రాయపడ్డారు.

## ఉచిత ఆధార్ సేవలు వినియోగించుకోండి

వేములవాడ అర్బన్, జూలై 23 (ఈవార్తలు): వేములవాడ పట్టణంలోని చెక్కపల్లి రోడ్డులో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆధార్ నమోదు, సవరణ సేవలు అందుబాటులో ఉన్నాయని ఆధార్ ఆపరేటర్ కటుకం ప్రశాంత్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ సేవల్లో భాగంగా 5 నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలకు తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్‌తో పాటు కొత్త ఆధార్ నమోదును పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే పేరు, చిరునామా, జన్మతేది, మొబైల్ నంబర్ తదితర వివరాల్లో మార్పులు చేయించుకోవాలనుకునే వారు యూఐడీఏఐ నిబంధనల మేరకు నామమాత్రపు రుసుము చెల్లించి సవరణలు చేయించుకోవచ్చని తెలిపారు. అర్హులైన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆధార్‌కు సంబంధించిన సేవలను పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



## వేములవాడ లడ్డు సత్రంలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు

వేములవాడ అర్బన్, జూలై 23 (ఈవార్తలు): వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం లడ్డు సత్రంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆహార పదార్థాల తయారీలో అత్యున్నత పరిశుభ్రత ప్రమాణాలు పాటించేలా లడ్డు సత్రం పరిసరాలను పూర్తిస్థాయిలో శుభ్రపరిచారు. లడ్డు కౌంటర్, పులిహోర తయారీ విభాగం, లడ్డు తయారీ కేంద్రం, కలపడానికి ఉపయోగించే పాత్రలు, ఇతర ఆహార పదార్థాల తయారీ ప్రాంతాలను వేడి నీటితో శుభ్రపరచడంతో పాటు శానిటైజింగ్ ద్రావణాలతో పరిశుభ్రం చేశారు. అలాగే ఆహార తయారీ హాల్స్, నిల్వ గదులు, పని ప్రదేశాలు, సిబ్బంది వినియోగించే ప్రాంతాల్లోనూ ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎల్. రమాదేవి ఆదేశాల మేరకు లడ్డు సత్రం పర్యవేక్షకులు పచ్చునూరి రాజేందర్, సత్రం ఇన్‌చార్జి బొడుసు మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. లడ్డు సత్రం సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది పాల్గొని పరిశుభ్రత చర్యలను సమర్థవంతంగా అమలు చేశారు. భక్తులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ప్రసాదాలను అందించడమే లక్ష్యంగా దేవస్థానం తరచూ ఇలాంటి ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.



## నూకపల్లి డబుల్ బెడ్రూమ్ కాలనీలో ఇంటింటి సర్వే

మల్యాల, జూలై 23 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా నూకపల్లి అర్బన్ ఇందిరమ్మ డబుల్ బెడ్రూమ్స్ కాలనీలో నెలకొన్న సమస్యలను గుర్తించేందుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. కాలనీలో తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, డ్రైనేజీ, రహదారులు తదితర మౌలిక సమస్యలను నమోదు చేసి, వాటిపై రూపొందించిన కరపత్రాన్ని ప్రతి ఇంటికి పంపిణీ చేశారు. డా. విశారదన్ మహారాజ్ చేపట్టనున్న ఒక లక్ష కిలోమీటర్ల "మా భూమి రథయాత్ర" ఆగస్టు 28న జగిత్యాల జిల్లా నుంచి పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయన కాలనీని సందర్శించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని జేఏసీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మనాల కిషన్, ప్రధాన కార్యదర్శి పాడాల శ్రీనివాస్, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దువ్వాక శివ మహారాజ్, కోశాధికారి ఉపేంద్ర, స్థానిక నాయకులు స్వామి, కలీల్, లక్ష్మీనారాయణ, ప్రణీత్, తరుణ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

## పెగడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ తనిఖీ

పెగడపల్లి, జూలై 23 (ఈవార్తలు): వార్షిక తనిఖీల్లో భాగంగా పెగడపల్లి పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఐపీఎస్ గురువారం తనిఖీ చేశారు. స్టేషన్‌లోని వివిధ విభాగాలు, రికార్డులు, రిజిస్టర్లు, క్రైమ్ రికార్డులు, జనరల్ డైరీ, ఆర్మ్ రూమ్, స్టోర్స్, లాకప్ రూమ్‌లను పరిశీలించారు. పెండింగ్ కేసులను సమీక్షించి, దర్యాప్తులో ఉన్న కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలు, నేరాల పరిస్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు మరింత చేరువగా పోలీసు విధులు ఉండాలని సూచించారు. ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. కేసుల దర్యాప్తులో వేగం, సాక్ష్యాల సేకరణలో నిష్పక్షపాత ధోరణి అవసరమని సూచించారు. రిసెప్షన్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుళ్లను, పిటిషన్ మేనేజ్‌మెంట్‌లో నమోదైన వివరాలను ఎస్పీ పరిశీలించారు. ప్రతి దరఖాస్తుకు పిటిషన్ మేనేజ్‌మెంట్‌లో జనరేట్ చేసిన రసీదును తప్పనిసరిగా అందించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాల్లో 5ఎస్ విధానాన్ని పాటిస్తూ పరిశుభ్రతను కాపాడాలని, ఫైళ్లను క్రమపద్ధతిలో నిర్దేశిత ప్రదేశాల్లో భద్రపరచాలని ఆదేశించారు.

# కాక్రోచ్ వీడియోలు తొలగించండి

**విద్యార్థులకు ఐఐటీ మద్రాస్ ఆదేశం**




చెన్నై: నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. నినాదాలు, బ్యానర్లపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేయడం, షార్ట్ వీడియోలు సహా వివిధ రూపాల్లో నిరసన తెలియజేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) మద్రాస్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలలో పోస్ట్ చేసిన వీడియోలను తొలగించామని తన విద్యార్థులను కోరింది. పేరు చెప్పడానికి నిరాకరించిన ఐఐటీ మద్రాస్ విద్యార్థి ఒకరు మాట్లాడుతూ.. "విద్యార్థుల నిరసనలకు మద్దతుగా పెట్టిన ఇన్‌స్టాగ్రామ్ వీడియోలను తొలగించమని విశ్వవిద్యాలయం మమ్మల్ని కోరింది" అని అన్నారు. ఆదేశాలను పాటించాలని డీన్ తమను కోరారని అన్నారు. "జంతర్ మంతర్ నిరసనలకు సంబంధించిన పోస్టులను తొలగించమని డీన్ మమ్మల్ని కోరారు.. ఈ విషయమై మా ఫ్యాకల్టీ అడ్వైజర్‌ను కూడా పిలిపించారు. సంఘీభావ వీడియోలు సహా ఆ పోస్టులను మేము తొలగిస్తున్నాం... ఆ వీడియో రూపకల్పనకు మీరుకు సహకరించారు కాబట్టి, ఈ విషయం మీకు తెలియజేయడం ముఖ్యమని మేము భావించాం" అని ఐఐటీ మద్రాస్ విద్యార్థికి వచ్చిన ఒక సందేశంలో పేర్కొన్నారు. 'జంతర్ మంతర్ నిరసనకు మద్దతు.. ఆమరణ నిరాహార దీక్ష చేస్తోన్న సోనమ్ వాంగ్‌చుక్, విద్యార్థులకు సంఘీభావం.. విద్యార్థుల ప్రాణాలు ముఖ్యం' అనే బ్యానర్ పట్టుకుని విద్యార్థులు ప్రదర్శనగా వెళ్తున్న దృశ్యాల వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీనిపై ఐఐటీ మద్రాసు యాజమాన్యం తీవ్రంగా స్పందించి, విచారణ చేపట్టింది.

# విద్యార్థుల ఆందోళనల్లో నిజముంది

**బీజేపీ సీనియర్ నేత మురళీ మనోహర్ జోషీ మద్దతు**



న్యూఢిల్లీ: నీట్ ప్రశ్నాపత్రం లీక్‌కు వ్యతిరేకంగా దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థులు కొనసాగిస్తున్న ఆందోళనలపై బీజేపీ సీనియర్ నేత మురళీ మనోహర్ జోషి స్పందించారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువత కొన్ని రోజులుగా ఢిల్లీ వీధుల్లో నిరసనలు కొనసాగించడం చాలా బాధకరమని ఆయన అన్నారు. పరీక్షలపై వారి ఆందోళనలు, సమస్యలు నిజమైనవని, సానుభూతితో పరిష్కరించాలని ఆయన సూచించారు. దీనిని బలప్రయోగం ద్వారా అణచివేసే శాంతిభద్రతల సమస్యగా చూడరని తాను ఆశిస్తున్నానని కేంద్ర ప్రభుత్వానికి చురకలంటించారు. ఇటువంటి చర్యలు వికసిత్ భారత్ లక్ష్యానికి అనేక వర్గాలను దూరం చేస్తుందని ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువ విద్యార్థులు కొన్ని రోజులుగా న్యూఢిల్లీ రోడ్లపై పడిగాపులు కాయడం తీవ్ర బాధాకరం... పరీక్షల వ్యవస్థలపై వారి ఆందోళనలు, భయాలు సమస్యలు నిజమైనవి... వాటికి సానుభూతితో, దీర్ఘకాలిక పరిష్కారాలతో బదులివ్వాలి... దీనిని కేవలం బలప్రయోగం ద్వారా అణచివేసే శాంతిభద్రతల సమస్యగా మాత్రమే చూడరని నేను మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను.. నిరసనలు తెలుపుతున్న మహిళలు, యువతులపై క్రూరంగా వ్యవహరించడం నన్ను తీవ్రంగా కలచివేసింది... ఇలాంటి బలప్రయోగం దేశాన్ని 'వికసిత్ భారత్‌గా' తీర్చిదిద్దాలనే జాతీయ లక్ష్యం నుంచి అనేక వర్గాలను దూరం చేస్తుంది" అని మురళీ మనోహర్ జోషీ కేంద్రంపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనలకు మద్దతుగా దేశవ్యాప్తంగా విద్యార్థులు నిరసనలు కొనసాగుతున్నాయి. ముంబయిలో నిరసన చేస్తున్న విద్యార్థులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. వారిపై బెదిరింపులకు పాల్పడిన వీడియో వైరల్ అయ్యింది. మళ్లీ ఆందోళనల్లో పాల్గొంటే డ్రగ్స్ కేసులో ఇరికిస్తానని ఓ పోలీసు అధికారి వారిని బెదిరించడం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో మురళీ మనోహర్ జోషి సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

# విద్యార్థుల పక్షాన మేం ఉన్నాం

**గాంధీ స్మృతి వద్ద రాహుల్ గాంధీ నిరసన దీక్ష**



న్యూఢిల్లీ: నీట్-యూజీ 2026 పరీక్ష పేపర్ లీక్ వివాదంతో నష్టపోయిన విద్యార్థులకు అండగా నిలుస్తూ ప్రతిపక్ష 'ఇండియా' కూటమి ఎంపీలు ఆందోళన చేపట్టారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో గురువారం సాయంత్రం ఢిల్లీలోని తీస్ జనవరి మార్గ్‌లో ఉన్న గాంధీ స్మృతి వద్ద వారు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ వివాదం కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు, నిరసనల్లో గాయపడిన వారికి సంఘీభావం ప్రకటించారు. అంతకుముందు, రాహుల్ గాంధీ నివాసంలో విపక్ష నేతలు సమావేశమయ్యారు. అనంతరం ప్రియాంక గాంధీ వాద్రాతో సహా పలువురు నేతలు బస్సుల్లో గాంధీ స్మృతికి చేరుకున్నారు. అక్కడ వారు తమ మొబైల్ ఫోన్ల ఫ్లాష్‌లైట్లను వెలిగించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ ఒక చేతిలో జాతీయ జెండాను, మరో చేతిలో రాజ్యాంగ ప్రతిని పట్టుకుని కనిపించారు. ఈ నిరసనపై రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా స్పందించారు. న్యాయం, జవాబుదారీతనం కోరుతున్న విద్యార్థులతో ప్రతిపక్షాలు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. "భారతదేశ విద్యార్థులు ఒంటరి కాదు. విద్యార్థుల పక్షాన నిలబడకుండా మమ్మల్ని ఎవరూ ఆపలేరు" అని పేర్కొన్నారు. నీట్ అక్రమాల తర్వాత ప్రాణాలు తీసుకున్న విద్యార్థులను స్మరించుకుంటూ, ఆందోళనల్లో గాయపడిన వారికి మద్దతుగా ఈ పోరాటం చేస్తున్నామని తెలిపారు. వాస్తవానికి విపక్షాలు ఇండియా గేట్ వరకు ప్రదర్శనగా వెళ్లాలని భావించినా, పోలీసులు అనుమతి నిరాకరించినట్లు సమాచారం. దీంతో రాహుల్ నివాసానికి కిలోమీటరు దూరంలోనే ఉన్న గాంధీ స్మృతి వద్ద నిరసన చేపట్టారు. మరోవైపు, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న తమ డిమాండ్‌కు కట్టుబడి ఉన్నామని కాంగ్రెస్ ఎంపీ కుమారి సెల్జా స్పష్టం చేశారు.




## ఇన్ఫోసిస్ తదుపరి సీఈవోగా ఆశిష్ కుమార్ దాష్

బెంగళూరు: దేశంలోని రెండో అతిపెద్ద ఐటీ సేవల సంస్థ ఇన్ఫోసిస్‌లో కీలక నాయకత్వ మార్పు చోటుచేసుకుంది. కంపెనీ తదుపరి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో)గా ఆశిష్ కుమార్ దాస్ నియమితులయ్యారు. ప్రస్తుత సీఈవో సలీల్ పరేఖ్ స్థానంలో ఆయన 2027 ఏప్రిల్ 1 నుంచి పూర్తిస్థాయి బాధ్యతలు స్వీకరిస్తారు. గురువారం జరిగిన సమావేశంలో నామినేషన్ అండ్ రెమ్యూనరేషన్ కమిటీ సిఫార్సుల మేరకు కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ఈ నియామకానికి ఆమోదముద్ర వేశారు. ఆశిష్ దాస్ తక్షణమే సీఈవో డెజిగ్నేట్‌గా బాధ్యతలు చేపట్టి, నాయకత్వ మార్పు ప్రక్రియలో భాగస్వాములవుతారు. ఈ నియామకానికి వాటాదారుల మరియు చట్టపరమైన నియంత్రణ సంస్థల అనుమతులు లభించాల్సి ఉంది. ఇన్ఫోసిస్‌లో దాదాపు మూడు దశాబ్దాలు అనుభవం ఉన్న ఆశిష్, సంస్థ చేపట్టిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పరివర్తన ప్రయత్నాల్లో కీలక పాత్ర పోషించారు. ఈ నియామకంపై ఇన్ఫోసిస్ బోర్డు ఛైర్మన్ నందన్ నీలేకని స్పందిస్తూ, కంపెనీ విలువలను కాపాడుతూనే, సమకాలీన అవసరాలకు అనుగుణంగా సాహసోపేతమైన మార్పులు తీసుకురాగల సమర్థవంతమైన నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. బోర్డు తనపై ఉంచిన నమ్మకానికి ఆశిష్ దాస్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత సీఈవో సలీల్ పరేఖ్ ఈ పరిణామాన్ని స్వాగతించారు. నాయకత్వ బదిలీ ప్రక్రియ అత్యంత సజావుగా సాగుతుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఇదే సమావేశంలో అర్హులైన నూతన ఉద్యోగులకు 9,836 రెస్ట్రిక్టెడ్ స్టాక్ యూనిట్లను (ఆర్ఎస్‌యూలు), ఇతర ఉద్యోగులకు సుమారు 4.78 లక్షల ఈక్విటీ షేర్లను కేటాయించేందుకు కూడా బోర్డు ఆమోదం తెలిపింది.

## ఒక్కసారి ఛార్జ్‌తో 526 కిమీ ప్రయాణం

**కియా నుంచి కొత్త ఈవీ విడుదల**

బెంగళూరు: ఎలక్ట్రిక్ వాహనాల విభాగంలో తన ఉనికిని మరింత బలోపేతం చేస్తూ కియా ఇండియా కొత్త సిరోస్ ఈవీని మార్కెట్లోకి తీసుకొచ్చింది. ఎక్స్‌షోరూమ్ ప్రారంభ ధరను రూ.13.49 లక్షలుగా నిర్ణయించింది. ఒకసారి పూర్తిగా ఛార్జ్ చేస్తే గరిష్ఠంగా 526 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదని కంపెనీ వెల్లడించింది. జులై 30న డెలివరీలు ప్రారంభం కానున్నాయి. సిరోస్ ఈవీని 42 కిలోవాట్ అవర్, 51.4 కిలోవాట్ అవర్.. రెండు బ్యాటరీ ప్యాక్‌లతో అందుబాటులోకి తీసుకొచ్చింది. 42 కిలోవాట్ అవర్ బ్యాటరీతో 443 కిలోమీటర్లు, 51.4 కిలోవాట్ అవర్ బ్యాటరీతో 526 కిలోమీటర్ల వరకు రేంజ్ లభిస్తుందని తెలిపింది. ఈ సెగ్మెంట్‌లో 500 కిలోమీటర్లకు పైగా సర్టిఫైడ్ రేంజ్‌ను అందిస్తున్న తొలి మోడల్‌గా సిరోస్ ఈవీ నిలిచిందని కియా పేర్కొంది. డిజైన్ పరంగా పెట్రోల్ సిరోస్‌ను పోలి ఉన్నప్పటికీ, ఈవీ కోసం ప్రత్యేకంగా క్లోజ్డ్ డిజిటల్ టైగర్ ఫేస్ గ్రిల్, కొత్త బంపర్లు, ఐస్ క్యూబ్ ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్స్, స్టార్ మ్యాప్ లైటింగ్, ఏరో అలాయ్ వీల్స్, ఫ్లష్ డోర్ హ్యాండిల్స్‌ను అందించారు. మొత్తం తొమ్మిది రంగుల్లో ఈ మోడల్‌ను విక్రయించనున్నారు. క్యాబిన్‌లో 30 అంగుళాల ట్రినిటీ డిస్‌ప్లే, వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్‌ప్లే, ఎనిమిది స్పీకర్ల హార్మన్ కార్డన్ సౌండ్ సిస్టమ్, ముందు, వెనుక వెంటిలేటెడ్ సీట్లు, పనోరమిక్ సన్‌రూఫ్, వైర్‌లెస్ ఛార్జర్, 16 లీటర్ల ఫ్రంక్ వంటి ఫీచర్లను అందించారు. పెద్ద బ్యాటరీ వేరియంట్ 0 నుంచి 100 కిమీ వేగాన్ని 8.1 సెకన్లలో అందుకుంటుంది. 100 కిలోవాట్ డీసీ ఫాస్ట్ ఛార్జర్‌తో 10 నుంచి 80 శాతం ఛార్జ్ కావడానికి కేవలం 39 నిమిషాలు పడుతుందని కంపెనీ తెలిపింది. భద్రత కోసం ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, లెవల్-2 ఏడీఏఎస్, 360 డిగ్రీ కెమెరా, బ్లైండ్ వ్యూ మానిటర్, ఈఎస్‌సీ, హిల్ స్టార్ట్ అసిస్ట్, టైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్, ఐఎస్‌ఓఫిక్స్ చైల్డ్ సీట్ మౌంట్స్ వంటి ఫీచర్లను అందించారు.



## సెన్సెక్స్ 364 పాయింట్లు డౌన్

ముంబై: అమెరికా-ఇరాన్ మధ్య తాజా ఉద్రిక్తతలతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరగడం భారత స్టాక్ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపింది. దీంతో దేశీయ సూచీలు వరుసగా నాలుగో రోజూ నష్టాల్లో ముగిశాయి. గురువారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 364 పాయింట్లు పడిపోయి 76,391.39 వద్ద ముగిసింది. నిఫ్టీ 127 పాయింట్లు కోల్పోయి 23,869.60 వద్ద స్థిరపడింది. నిఫ్టీ-50 సూచీలో ఎస్‌బీఐ లైఫ్, బజాజ్ ఆటో, ఎంఅండ్ఎం, టీసీఎస్, టాటా కన్స్యూమర్స్ షేర్లు లాభపడ్డాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్, నెస్లే ఇండియా, శ్రీరామ్ ఫైనాన్స్, అదానీ పోర్ట్స్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్ షేర్లు నష్టపోయిన వాటిలో ఉన్నాయి. బ్యాంకింగ్, రియాల్టీ, చమురు సంబంధిత షేర్లలో అమ్మకాల ఒత్తిడి ఎక్కువగా కనిపించింది. నిఫ్టీ రియాల్టీ సూచీ 1.81 శాతం క్షీణించగా, పీఎస్‌యూ బ్యాంక్ సూచీ 1 శాతం, నిఫ్టీ బ్యాంక్ 0.94 శాతం చొప్పున పడిపోయాయి. కెమికల్, ఆయిల్ అండ్ గ్యాస్ సూచీలు కూడా నష్టాల్లో ముగిశాయి. అయితే ఆటో రంగం కొంత మెరుగ్గా రాణించింది. నిఫ్టీ ఆటో సూచీ 0.70 శాతం లాభపడగా, మీడియా సూచీ కూడా స్వల్ప లాభాల్లో ముగిసింది. పశ్చిమాసియాలోని భౌగోళిక ఉద్రిక్తతలు, పెరుగుతున్న ముడి చమురు ధరలు.. ద్రవ్యోల్బణం, కార్పొరేట్ లాభాలపై ప్రభావం చూపవచ్చనే ఆందోళనతో పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరించినట్లు మార్కెట్ నిపుణులు తెలిపారు.

## అసోంలో 41కి చేరిన మృతులు

గౌహతి: అసోంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు తీవ్ర వినాశనాన్ని సృష్టిస్తున్నాయి. నదులన్నీ ఉగ్రరూపం దాల్చి ప్రమాద హెచ్చరిక స్థాయిలను దాటి ప్రవహిస్తుండటంతో రాష్ట్రంలో వరద పరిస్థితి అత్యంత విషమంగా మారింది. వేలాది మంది ఇళ్లను వదిలి దిక్కుతోచని స్థితిలో చిక్కుకుపోయారు. అసోం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ విడుదల చేసిన నివేదిక ప్రకారం... గడిచిన 24 గంటల్లోనే నలుగురు చిన్నారులతో సహా 10 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో వరదల కారణంగా సంభవించిన మొత్తం మరణాల సంఖ్య 41కి చేరుకుంది. తాజా మరణాల్లో శివసాగర్ జిల్లాలో ముగ్గురు, జోర్హాట్‌లో ముగ్గురు, చరైడియో జిల్లాలో ఇద్దరు, ధేమాజీ, కర్బీ అంగ్లాంగ్ జిల్లాల్లో ఒకరు చొప్పున ప్రాణాలు కోల్పోయారు. వీరితో పాటు మరో ముగ్గురు పురుషులు, ముగ్గురు మహిళలు సహా మొత్తం ఆరుగురు వరద నీటిలో కొట్టుకుపోయి గల్లంతయ్యారు.

## భారత్, చైనాతో విడివిడిగా దౌత్యం

**నేపాల్ ప్రధాన మంత్రి బాలేన్ షా కీలక నిర్ణయం**

ఖట్మండు: విదేశీ రాయబారులతో విడివిడిగా సమావేశాలు నిర్వహించకూడదనే తన స్వీయ నిబంధనను నేపాల్ ప్రధాన మంత్రి బాలేంద్ర షా బ్రేక్ చేసినట్టు సమాచారం. భారత్, చైనా ఇరుదేశాలతోనూ సంబంధాలను సమతౌల్యం చేసేందుకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ వారంలోనే భారత, చైనా రాయబారులతో ఆయన వేర్వేరుగా భేటీ కానున్నారు. న్యూఢిల్లీ, బీజింగ్ రెండింటికీ నేపాల్ సమాన ప్రాధాన్యత ఇస్తుందని నొక్కిచెప్పేందుకు భారత రాయబారి నవీన్ శ్రీవాస్తవ, చైనా రాయబారి ఝూంగ్ మావోమింగ్‌లతో ఒకే రోజున బాలేన్ షా భేటీ కావడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు 'ది కాఠ్మాండ్ పోస్ట్' పత్రిక ఓ కథనం వెలువరించింది. అయితే, ఈ భేటీ ఖచ్చితమైన తేదీలు ఇంకా ఖరారు కానప్పటికీ, త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని నేపాల్ ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. బాలెన్ షా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయిన నేపథ్యంలో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. సెప్టెంబరు 2025లో 'జెన్ జీ' ఉద్యమంతో కేపీ శర్మ ఓలీ ప్రభుత్వం కూలిపోగా.. ఈ ఏడాది మార్చిలో జరిగిన నేపాల్ పార్లమెంట్ ఎన్నికల్లో బాలేష్ షా పార్టీ విజయం సాధించి అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే.

## ఆరెస్సెస్‌కు ఓఎన్జీసీ 668 కోట్లు

న్యూఢిల్లీ: దేశంలోని నవరత్న కంపెనీలలో ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్జీసీ)కి మంచి పేరున్నది. ప్రస్తుతం దీన్ని గ్యాస్ అండ్ ఆయిల్ కంపెనీగా మార్చారు. దేశంలో క్రూడాయిల్ నిల్వలు కనుగొనడం, బయటకు తీయడం, ఉపాధి కల్పించడం ఈ ప్రభుత్వ రంగ సంస్థ ప్రధాన ఉద్దేశం. 2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ సంస్థ నుంచి గత పదేళ్లలో రూ.668 కోట్లు ఆర్ఎస్ఎస్, అనుబంధ సంస్థలకు భారీగా నిధులు అందించినట్లు తెలిసింది. సంఘ్‌పరివార్‌లోని ఇరవై సంస్థలు ఈ ప్రభుత్వ రంగ సంస్థ ద్వారా భారీగా లబ్ధి పొందినట్టు సమాచారం.

ఈవార్తలు
# వినోదవాణి
CINEMA
శుక్రవారం 24-7-2026, జగిత్యాల | www.evarthalu.com 

లవ్యాలి చిత్రం



సంచి రాయ్



## 'టాక్సిక్' పెద్దల సినిమా: నిర్మాత

కేజీఎఫ్ సిరీస్‌తో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రాక్ స్టార్ యశ్ నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' ఇప్పటికే భారీ అంచనాలను సొంతం చేసుకుంది. దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇటీవల విడుదలైన టీజర్, ప్రోమో వీడియోలు, పాటల్లో కనిపించిన బోల్డ్ కంటెంట్ సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాత కె. వెంకట నారాయణ తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో సినిమాపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టాక్సిక్ సాధారణ కమర్షియల్ సినిమా కాదని, తాము ఇప్పటివరకు నిర్మించిన చిత్రాల కంటే పూర్తిగా భిన్నమైన కథాంశంతో రూపొందించామని ఆయన తెలిపారు. ప్రేక్షకులు థియేటర్లలో ఈ సినిమాను చూసిన తర్వాత తప్పకుండా కొత్త అనుభూతిని పొందుతారని, సినిమా ముగిసిన తర్వాత చిత్ర బృందాన్ని అభినందిస్తారనే పూర్తి నమ్మకం తనకు ఉందని పేర్కొన్నారు. అంతేకాకుండా, 'టాక్సిక్' ఒక కల్పిత కథ ఆధారంగా రూపొందిన సినిమా అని, ముఖ్యంగా పెద్దల కోసం రూపొందించిన ప్రత్యేక కథనమని ఆయన స్పష్టం చేశారు. సినిమా టైటిల్‌కు తగ్గట్టుగానే ఇందులో భావోద్వేగాలు, యాక్షన్, రొమాన్స్ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలు ఉంటాయని సంకేతాలు ఇచ్చారు. ఇదిలా ఉంటే, ఇటీవల విడుదలైన 'మనసాగదే' పాటకు అద్భుతమైన స్పందన లభిస్తోంది. యశ్, తారా సుతారియా మధ్య సాగే ఈ రొమాంటిక్ ట్రాక్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచింది. ముఖ్యంగా పాటలోని విజువల్స్, సంగీతం, ఇద్దరి కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ పాటపై హీరోయిన్ తారా సుతారియా కూడా స్పందించారు. పాటలోని కొన్ని సన్నివేశాలను ఎంతో అందంగా చిత్రీకరించారని, చిత్రబృందం విజువల్‌గా అద్భుతమైన అనుభూతిని అందించిందని ఆమె సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు. దీంతో ఈ పాటకు మరింత క్రేజ్ ఏర్పడింది. భారీ తారాగణంతో రూపొందుతున్న ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషీ, తారా సుతారియా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

## బండ్ల గణేశ్ పిటిషన్ డిస్మిస్

ప్రముఖ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్‌కు అత్యున్నత న్యాయస్థానంలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తన స్థిరాస్తిని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వేలం వేయడాన్ని సమర్థిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. వివరాల్లోకి వెళితే.. తన వ్యాపార రుణాలకు సంబంధించి జూబ్లీహిల్స్‌లోని స్థిరాస్తిని యూనియన్ బ్యాంక్ వేలం వేయడాన్ని సవాలు చేస్తూ బండ్ల గణేశ్ గతంలో న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈ వ్యవహారంలో బ్యాంక్ చేపట్టిన వేలం సరైనదేనని, ఇందులో జోక్యం చేసుకోలేమని పేర్కొంటూ తెలంగాణ హైకోర్టు ఇటీవల యూనియన్ బ్యాంక్‌కు అనుకూలంగా తీర్పు వెలువరించింది.

## రణ్‌వీర్ 'ప్రళయ్'లో కళ్యాణి ప్రియదర్శన్



బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'ప్రళయ్'పై ఇప్పటికే సినీ వర్గాల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. యాక్షన్, ఎమోషన్స్ కలగలిపిన కథతో రూపొందుతున్న ఈ సినిమా గురించి వస్తున్న తాజా వార్త ఇప్పుడు మరింత ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా దక్షిణాది నటి కళ్యాణి ప్రియదర్శన్ ఎంపికైనట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కళ్యాణి ప్రియదర్శన్ ఇప్పటికే తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించారు. సహజమైన నటన, అందంతో యువతలో ప్రత్యేకమైన ఫాలోయింగ్ ఏర్పరచుకున్న ఆమెకు ఇప్పుడు బాలీవుడ్‌లో భారీ అవకాశం దక్కబోతుందనే వార్త చర్చనీయాంశంగా మారింది. రణ్‌వీర్ సింగ్ వంటి స్టార్ హీరో సరసన నటించే అవకాశం రావడం ఆమె కెరీర్‌లో కీలక మలుపుగా భావిస్తున్నారు. రణ్‌వీర్ సింగ్ తన ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్, విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తూ వస్తున్నారు. అలాంటి హీరోతో కళ్యాణి జోడీ కట్టడం సినిమాపై మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ ఇద్దరి మధ్య కెమిస్ట్రీ ఎలా ఉంటుందో తెలుసుకోవాలని అభిమానులు ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా దక్షిణాది ప్రేక్షకుల్లో కూడా ఈ కాంబినేషన్‌పై చర్చ మొదలైంది. 'ప్రళయ్' చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. యాక్షన్ సీక్వెన్సులతో పాటు భావోద్వేగాలకు కూడా ప్రాధాన్యత ఇచ్చే కథగా రూపొందుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అంతర్జాతీయ స్థాయి సాంకేతిక ప్రమాణాలతో సినిమాను రూపొందించేందుకు మేకర్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కళ్యాణి ప్రియదర్శన్ ఎంపికపై అధికారిక ప్రకటన రాకపోయినా, త్వరలోనే చిత్రబృందం పూర్తి తారాగణాన్ని ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. తదుపరి షూటింగ్ షెడ్యూల్ కూడా త్వరలో ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి రణ్‌వీర్ సింగ్ – కళ్యాణి ప్రియదర్శన్ కాంబినేషన్ నిజమైతే, ఇది దక్షిణాది – బాలీవుడ్ కలయికలో మరో ఆసక్తికర జోడీగా నిలిచే అవకాశముందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ కొత్త జంట వెండితెరపై ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలంటే అధికారిక ప్రకటనతో పాటు సినిమా విడుదల వరకు వేచి చూడాల్సిందే.



## ప్రెగ్నెన్సీ కోసం 1000 ఇంజెక్షన్లు తీసుకున్నా

సినీ నటి, మోడల్ తేజస్విని కోల్హాపురి.. తాజాగా ఓ పోడ్‌కాస్ట్‌కు ఇంటర్వ్యూ ఇచ్చింది. ప్రెగ్నెన్సీ కోసం ఐవీఎఫ్ చేయించుకున్న తీరు గురించి ఆమె హృదయవిదారకర పరిస్థితిని వివరించింది. సిద్ధార్థ కన్నన్‌తో జరిగిన పోడ్‌కాస్ట్‌లో ఆమె మాట్లాడుతూ.. ఐవీఎఫ్ పద్ధతిలో పిల్లలు కనేందుకు చాలా ఇబ్బందిపడినట్లు చెప్పింది. ఒకప్పటి సినీ నటి పద్మిని కొల్హాపురి సోదరియే తేజస్విని. బాలీవుడ్ నటులు శ్రద్ధా కపూర్, సిద్ధాంత్ కపూర్‌లకు వరుసకు మేనత్త అవుతుంది. అయితే ఐవీఎఫ్ విధానం వల్ల తీవ్రమైన మానసిక, శారీరక బాధను అనుభవించాల్సి వచ్చినట్లు చెప్పిందామె. తన జీవితంలో అదో సంక్లిష్టమైన దశ అని ఆమె తెలిపారు. అయిదు సార్లు ఐవీఎఫ్ చేయించుకున్నట్లు తేజస్విని చెప్పింది . దీని గురించి ఓపెన్‌గానే మాట్లాడుతాను. ఐవీఎఫ్ పద్ధతి చాలా కష్టమైందన్నారు. మొదటిసారి, రెండోసారి సమస్య తీవ్రంగా ఉంటుందని, ఇక ఆ తర్వాత మూడు, నాలుగు, అయిదోసారి పర్వాలేదనిపిస్తుందన్నారు. మానసికంగా చాలా ధైర్యంగా ఉండాలని, ఇంజెక్షన్ల కోసం ప్రతిసారి క్లినిక్‌లకు వెళ్లాల్సి వస్తుందన్నారు. చాలా నొప్పిని తట్టుకోవాల్సి వస్తుందన్నారు. చాలా ఆలస్యంగా పిల్లలు కనాలని అనుకున్నానని, కానీ 35 ఏళ్ల లోపే పిల్లల్ని కనాలని సలహా ఇస్తున్నట్లు ఆమె చెప్పారు.

## విద్యార్థుల పోరాట పటిమ గొప్పది



దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న 'నీట్' పేపర్ లీక్ కుంభకోణం, తర్వాత పరిణామాలపై ప్రముఖ నటి నోరా ఫతేహి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆత్మహత్యలు తనను ఎంతగానో కలచివేశాయని చెబుతూ, వారి పోరాట పటిమను ఆమె ప్రశంసించారు. ఢిల్లీలో 'కాక్రోచ్ జనతా పార్టీ' ఆధ్వర్యంలో జరిగిన 'ఛలో సంసద్' మార్చ్‌పై పోలీసులు లాఠీఛార్జ్ చేసిన నేపథ్యంలో, ఆమె ఇన్ స్టాగ్రామ్ వేదికగా విద్యార్థులకు అండగా నిలుస్తూ ఒక భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. 'బాధలో ఉన్న ప్రతి విద్యార్థికి, వారి కుటుంబాలకు నా హృదయపూర్వక మద్దతు ఉంటుంది. విద్య అంటే కేవలం మార్కులు కాదు.. అదొక ఆశ, ఒక స్వప్నం. పేపర్ లీక్ వార్తలు యువతను తీవ్ర నిరాశకు గురి చేశాయి. విద్యార్థుల ఆత్మహత్యల వార్తలు నన్ను కుదిపేశాయి. ఏ పరీక్ష లేదా ఏ వ్యవస్థ కూడా ఒక యువ ప్రాణాన్ని బలిగొనేలా ఉండకూడదు. పిల్లల్ని కోల్పోయిన కుటుంబాల బాధ వర్ణనాతీతం' అని నోరా ఆవేదన వ్యక్తం చేశారు. భారతీయ విద్యార్థుల ధైర్యం, పట్టుదల చూసి తాను ఆశ్చర్యపోయానని, తన ప్లాట్‌ఫారమ్ ద్వారా వారికి మద్దతు తెలపాలని నిర్ణయించుకున్నట్లు ఆమె క్యాప్షన్‌లో పేర్కొన్నారు.



## డబ్బు కోసం వ్యక్తిత్వాన్ని మార్చుకోను

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ మరోసారి తన వ్యక్తిగత అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడించారు. సినిమాల్లో బికినీ, బోల్డ్ సన్నివేశాలు, రొమాంటిక్ సీన్స్‌పై ఇటీవల జరుగుతున్న చర్చల మధ్య ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా పెళ్లి తర్వాత హీరోయిన్లు గ్లామర్ పాత్రలు చేయడంపై వస్తున్న విమర్శల నేపథ్యంలో కాజల్ స్పందించిన తీరు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రస్తుతం 'ది ఇండియా స్టోరీ' సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న కాజల్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, కెరీర్ ప్రారంభం నుంచే తాను బికినీ లేదా అతిగా బోల్డ్ సన్నివేశాల్లో నటించడానికి ఆసక్తి చూపలేదని తెలిపారు. అలాంటి పాత్రలు చేయడం తనకు వ్యక్తిగతంగా అసౌకర్యంగా అనిపిస్తుందని, అందుకే ఎన్నో భారీ చిత్రాలను కూడా వదులుకున్నానని వెల్లడించారు. సినిమాల కోసం లేదా డబ్బు కోసం నా వ్యక్తిత్వాన్ని మార్చుకోలేను. నాకు కొన్ని విలువలు, సిద్ధాంతాలు ఉన్నాయి.



# అర్జెంటీనాపై తీవ్ర వ్యతిరేకత

ఫిఫా ప్రపంచకప్ 2026లో లియోనెల్ మెస్సీ నేతృత్వంలోని అర్జెంటీనా జట్టు ఫైనల్ వరకు దూసుకెళ్లినా, చివరకు స్పెయిన్ చేతిలో 0-1 తేడాతో ఓటమి పాలైంది. అయితే, ఈ ఓటమి కన్నా పెద్ద చర్చ ఆ జట్టు ప్రవర్తన, దానిపై వ్యక్తమైన ప్రపంచవ్యాప్త వ్యతిరేకత గురించే జరుగుతోంది. అందమైన ఆటతీరుతో అభిమానుల మనసు గెలుచుకోవడం పక్కన పెడితే, టోర్నమెంట్ ఆసాంతం వివాదాలతో, దూకుడు ప్రదర్శనతో అర్జెంటీనా చరిత్రలోనే అత్యంత ద్వేషించబడ్డ జట్టుగా నిలిచిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టోర్నీ జరుగుతున్న సమయంలోనే ఫిఫా.. అర్జెంటీనాకు అనుకూలంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలు బలంగా వినిపించాయి. ఈ నేపథ్యంలోనే 'అర్జెంటీనా అవుట్' పేరుతో ఒక ఆన్‌లైన్ పిటిషన్ ప్రారంభమైంది. "విజేత ఎవరో ముందే తెలిస్తే, మిగతా జట్లు టోర్నమెంట్‌లో ఎందుకు ఆడాలి? అర్జెంటీనాని ప్రపంచకప్ నుంచి మినహాయించి అందరికీ సమాన అవకాశం ఇవ్వండి" అన్నది ఆ పిటిషన్ సారాంశం. అనూహ్యంగా ఈ పిటిషన్‌కు ప్రపంచవ్యాప్తంగా భారీ మద్దతు లభించింది. ఫైనల్ ముగిసే సమయానికి ఇది దాదాపు గిన్నిస్ వరల్డ్ రికార్డును బద్దలు కొట్టే స్థాయికి చేరుకుంది. ముఖ్యంగా ఫైనల్ మ్యాచ్‌లో అర్జెంటీనా ఆటగాళ్ల ప్రవర్తన ఈ వ్యతిరేకతను మరింత పెంచింది. మ్యాచ్ ముగిసిన తర్వాత అర్జెంటీనా ఆటగాడు లియాండ్రో పరేడెస్.. స్పెయిన్ డిఫెండర్ ఎరిక్ గార్సియాను కొట్టడం, మరో ఆటగాడు గావిని కిందకు తోసేయడం వంటి చర్యలు తీవ్ర విమర్శలకు దారితీశాయి. అంతకుముందు మ్యాచ్‌లో పావ్ కుబార్సిని ప్రమాదకరంగా అడ్డుకున్నందుకు ఎంజో ఫెర్నాండెజ్‌కు రెడ్ కార్డ్ చూపడం కూడా అర్జెంటీనా ఓటమిలో కీలక పాత్ర పోషించింది. వివిధ యూరోపియన్ మీడియా కథనాల ప్రకారం.. ఈ పిటిషన్‌పై ప్రపంచవ్యాప్తంగా 170 దేశాల నుంచి ఏకంగా 2,33,16,108 మంది సంతకాలు చేశారు. ఇది గతంలో 'జూబ్లీ 2000' ఉద్యమం సాధించిన 2.43 కోట్ల సంతకాల గిన్నిస్ రికార్డుకు అత్యంత చేరువగా రావడం గమనార్హం. ఫైనల్‌లో అర్జెంటీనా ఓటమి తర్వాత పిటిషన్ నిర్వాహకులు "ఫిఫా మమ్మల్ని పట్టించుకోలేదు, కానీ స్పెయిన్ తన మాట నిలబెట్టుకుంది... థ్యాంక్యూ స్పెయిన్" అంటూ తమ ప్రచారాన్ని ముగించారు. ఈ పరిణామాలన్నీ అర్జెంటీనా జట్టుకు ఈ ప్రపంచకప్‌లో చేదు అనుభవాన్ని మిగిల్చాయి.

# కాక్రోచ్‌లకు మద్దతిస్తున్నా



ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ(జజీపా) ఆధ్వర్యంలో విద్యార్థులు చేస్తున్న పోరాటానికి రోజురోజుకు మద్దతు పెరుగుతోంది. తాజాగా ఒలింపిక్ స్వర్ణ విజేత అభినవ్ బింద్రా సైతం విద్యార్థుల వెంట నిలిచారు. దేశంలో కొన్ని అంశాలకు మనం పట్టింపులు లేకుండా ఎలా మద్దతిస్తామో.. విద్యార్థుల సమస్యలకు జరుగుతున్న ఈ ఉద్యమానికి కూడా అండగా నిలవాలని పిలుపినిచ్చారు. నీట్ పేపర్ లీకేజీపై జవాబుదారీతనం కోరుతున్న కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమానికి ప్రజాదరణ పెరుగుతోంది. సామాజిక ఉద్యమకారులు, సినీ సెలబ్రిటీలే కాదు క్రీడా ప్రముఖులు కూడా 'మేమూ మీ వెంటే' అంటున్నారు. బీజింగ్ ఒలింపిక్స్‌లో పసిడి పతకంతో దేశం గర్వపడేలా చేసిన అభినవ్ బింద్రా కూడా విద్యార్థి ఉద్యమానికి మద్దతు పలికారు. జవంతర్ మంతర్ వద్ద రోజురోజుకు తీవ్ర రూపం దాలుస్తున్న నిరసనల హోరుకు గురువారం ఎక్స్ పోస్ట్ ద్వారా ఈ మాజీ షూటర్ తన సంఘీభావం తెలియజేశారు. 'నన్ను నేను రాజకీయవేత్తగా భావించను. కానీ, మనం ఏంటీ అనేదాని కంటే.. కొన్ని విషయాలు మనందరికి సంబంధించినవి. వాటిలో విద్యావ్యవస్థ ఒకటి. ఆర్థిక పురోగతి, సాధించిన విజయాలనే బట్టే కాకుండా యువతకు కల్పిస్తున్న అవకాశాలను బట్టి ఒక దేశ అభివృద్ధిని కొలుస్తారు. విద్యా వ్యవస్థ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు అందేలా చేస్తుంది. మనలో సృజనాత్మకతను పెంచే ఈ వ్యవస్థ దేశానికి అతిపెద్ద బలం. మన విద్యావ్యవస్థను పటిష్టం చేసుకునేందుకు అందరం కలిసి.. పనిచేయాలి. అలా చేసినప్పుడే రేపటి తరాలకు అవకాశాలను, ఆవిష్కరణలు చేసేందుకు ప్రోత్సాహాన్ని, నమ్మకాన్ని ఇవ్వగలుగుతాం' అని ఎక్స్ పోస్టులో బింద్రా రాసుకొచ్చారు. షూటింగ్‌లో భారత్‌కు తొలి ఒలింపిక్ స్వర్ణం అందించిన బింద్రా.. వ్యాపారవేత్తగా, స్పోర్ట్స్ అడ్మినిస్ట్రేటర్‌గా రాణిస్తున్నారు. తన పేరిట నెలకొల్పిన 'అభినవ్ ఫ్యూచరిస్టిక్స్' సంస్థకు సీఈఓగా వ్యవహరిస్తున్నారీ మాజీ ఒలింపియన్. అంతేకాదు అంతర్జాతీయ ఒలింపిక్స్ కమిటీలో ఆయన సభ్యుడు కూడా.







# వైభవ్ దంచుడే దంచుడు

**జింబాబ్వేపై టీమిండియా ఈజీ విక్టరీ.. తొలి టీ20లో జింబాబ్వేపై విజయం**

**జింబాబ్వే పర్యటనను భారత జట్టు ఘన విజయంతో ప్రారంభించింది. హరారే వేదికగా జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో టీమిండియా 7 వికెట్ల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ (50; 19 బంతుల్లో 4-4, 4-6) విధ్వంసకర అర్ధశతకంతో చెలరేగడంతో టీమిండియా సునాయాసంగా నెగ్గింది.**



ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 126 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. అభిషేక్ శర్మ (1) త్వరగా ఔటయ్యాడు. అయితే, మరో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 19 బంతుల్లోనే మెరుపు అర్ధశతకం పూర్తి చేసి జింబాబ్వే బౌలర్లను ఉతికారేశాడు. అతనికి ఇషాన్ కిషన్ (35) చక్కటి సహకారం అందించడంతో భారత్ విజయం సులువైంది. వీరిద్దరూ ఔటయ్యాక, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (28 నాటౌట్), తిలక్ వర్మ (6 నాటౌట్) మిగిలిన లాంఛనాన్ని పూర్తి చేశారు. దీంతో భారత్ 13.2 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జింబాబ్వే బౌలర్లలో బ్లెస్సింగ్ ముజరబానీ రెండు వికెట్లు తీశాడు. అంతకుముందు, టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నిర్ణయం సరైనదని బౌలర్లు నిరూపించారు. యువ పేసర్ మయాంక్ యాదవ్ (2/18) తన వేగంతో జింబాబ్వే బ్యాటర్లను వణికించాడు. మరో పేసర్ ప్రిన్స్ యాదవ్ (2/19) కూడా రాణించడంతో ఆతిథ్య జట్టు 32 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో వెస్లీ మధెవెరె (39), తడివానశే మరుమాని (27 నాటౌట్) కాసేపు పోరాడినా స్కోరు బోర్డును వేగంగా ముందుకు నడిపించలేకపోయారు. దీంతో జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 125 పరుగులు మాత్రమే చేయగలిగింది.



# భారత్ ఖాతాలో తొలి మెడల్

**బాక్సర్ లవ్లీనా బోర్గోహైన్‌కు కనీసం కాంస్యం ఖాయం**

**మహిళల 75 కేజీల విభాగంలో నేరుగా సెమీ ఫైనల్‌కు అర్హత**

**'బై' లభించడంతో బరిలోకి దిగకుండానే పతకం ఖరారు**

**31న సెమీ ఫైనల్ మ్యాచ్‌లో తలపడనున్న లవ్లీనా**

స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా 23వ కామన్వెల్త్ క్రీడలు ఇంకా అధికారికంగా ప్రారంభం కాకముందే భారత్ తన పతకాల ఖాతా తెరిచింది. ఒలింపిక్ పతక విజేత, స్టార్ బాక్సర్ లవ్లీనా బోర్గోహైన్ బరిలోకి దిగకుండానే దేశానికి తొలి పతకాన్ని ఖాయం చేసింది. మహిళల 75 కేజీల మిడిల్‌వెయిట్ విభాగంలో పోటీ పడుతున్న ఆమె, నేరుగా సెమీ ఫైనల్‌కు అర్హత సాధించడంతో ఈ అరుదైన ఘనత సాధ్యమైంది. లవ్లీనా పోటీ పడుతున్న 75 కేజీల బాక్సింగ్ విభాగంలో కేవలం ఐదుగురు అథ్లెట్లు మాత్రమే బరిలో ఉన్నారు. డ్రాలో తక్కువ మంది ఉండటంతో లవ్లీనాతో సహా ముగ్గురు బాక్సర్లకు నేరుగా సెమీ ఫైనల్‌కు 'బై' లభించింది. మిగిలిన ఇద్దరు క్వార్టర్ ఫైనల్‌లో తలపడనున్నారు. కామన్వెల్త్ క్రీడల నిబంధనల ప్రకారం.. సెమీ ఫైనల్‌లో ఓడిపోయిన ఇద్దరు బాక్సర్లకు కాంస్య పతకాలు లభిస్తాయి. ఈ లెక్కన, లవ్లీనా తన తొలి బౌట్‌లో బరిలోకి దిగకముందే కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకుంది. కాంస్య పతకం ఖరారైనప్పటికీ లవ్లీనా ప్రస్థానం ఇప్పుడే మొదలైంది. ఈ నెల 31న జరిగే సెమీ ఫైనల్ మ్యాచ్‌లో ఆమె టాఫాకితో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే ఫైనల్‌కు చేరి, స్వర్ణ పతకం కోసం పోటీపడుతుంది. దాంతో కనీసం రజతం ఖాయమవుతుంది. ఒకవేళ సెమీస్‌లో ఓడినా, ఆమె కాంస్య పతకంతో స్వదేశానికి తిరిగి వస్తుంది. ఈసారి కామన్వెల్త్ క్రీడల్లో భారత్ 124 మంది సభ్యులతో కూడిన బలమైన బృందంతో పాల్గొంటోంది. నేడు ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుండగా, అంతకుముందే రెండు లాన్ బౌల్స్ మ్యాచ్‌లతో భారత క్రీడాకారులు తమ ప్రస్థానాన్ని అధికారికంగా ప్రారంభించనున్నారు. లవ్లీనా రూపంలో తొలి పతకం ఖరారు కావడం భారత శిబిరంలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

# చైనా ఓపెన్‌లో సింధుకు ఓటమి

**ఉత్కంఠ పోరులో చెన్ యుఫేయి విజయం**

చైనా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ప్రీక్వార్టర్ ఫైనల్లోనే నిష్క్రమించింది. గురువారం జరిగిన ఉత్కంఠభరిత పోరులో ప్రపంచ నాలుగో ర్యాంకర్, చైనా స్టార్ చెన్ యుఫేయి 16-21, 22-20, 21-18తో సింధుపై విజయం సాధించింది. గంటా 29 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో చివరి వరకు ఇద్దరూ హోరాహోరీగా తలపడ్డారు. ఇటీవల జపాన్ ఓపెన్‌లో టైటిల్ గెలిచి మంచి జోష్‌లో ఉన్న సింధు తొలి గేమ్‌ను అద్భుతంగా కైవసం చేసుకుంది. రెండో గేమ్‌లోనూ విజయం అంచుల వరకు వెళ్లిన ఆమె నాలుగు మ్యాచ్ పాయింట్లను సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఆ అవకాశాన్ని అందిపుచ్చుకున్న యుఫేయి రెండో గేమ్‌ను గెలిచి మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లింది. మూడో గేమ్‌లోనూ ఇద్దరూ నువ్వా-నేనా అన్నట్లుగా పోరాడినా, చివర్లో యుఫేయి కీలక పాయింట్లు సాధించి విజయాన్ని ఖాయం చేసుకుంది. దీంతో గతవారం జపాన్ ఓపెన్ సెమీఫైనల్లో ఎదురైన ఓటమికి యుఫేయి ప్రతీకారం తీర్చుకున్నట్లైంది. ఈ ఓటమితో చైనా ఓపెన్‌లో సింధు పోరాటం ముగిసింది. అయితే మ్యాచ్ మొత్తం అత్యున్నత స్థాయి ర్యాలీలు, పోరాట స్ఫూర్తితో సాగి అభిమానులను అలరించింది.



నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# భారతానికి కొత్త 'చిప్'

21వ శతాబ్దంలో చమురు ఎంత కీలకమో, 21వ శతాబ్దం రెండో భాగంలో సెమీకండక్టర్ చిప్‌లు అంతకంటే కీలకంగా మారబోతున్నాయి. ఒకప్పుడు చమురు కోసం ప్రపంచ దేశాలు పోటీ పడితే, ఇప్పుడు కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లు, కార్లు, కృత్రిమ మేధ, రక్షణ వ్యవస్థలు, అంతరిక్ష సాంకేతికత, వైద్య పరికరాలు, 5+, డేటా సెంటర్లు.. ఇవన్నింటికీ ప్రాణాధారంగా మారిన సెమీకండక్టర్ చిప్‌ల కోసం పోటీ పడుతున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో "చిప్ వార్స్" ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో భారత్ కూడా సెమీకండక్టర్ తయారీలో కీలక పాత్ర పోషించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. అయితే ప్రశ్న ఒక్కటే.. భారత్ నిజంగా ప్రపంచ సెమీకండక్టర్ తయారీ కేంద్రంగా ఎదగగలదా? సెమీకండక్టర్ అనేది విద్యుత్ ప్రవాహాన్ని నియంత్రించగల ప్రత్యేక పదార్థం. సిలికాన్ ఆధారంగా తయారయ్యే ఈ సూక్ష్మ చిప్‌లు నేటి ప్రతి ఎలక్ట్రానిక్ పరికరానికి మెదడులాంటివి. ఒక స్మార్ట్‌ఫోన్ లోనే వందలాది చిప్‌లు ఉంటాయి. ఆధునిక కారులో వేల సంఖ్యలో సెమీకండక్టర్ భాగాలు ఉపయోగిస్తారు. ఒక యుద్ధ విమానం, ఉపగ్రహం లేదా సూపర్ కంప్యూటర్‌ను కూడా చిప్‌లు లేకుండా ఊహించలేం. అందుకే సెమీకండక్టర్ పరిశ్రమ ఇప్పుడు ఆర్థిక వ్యవస్థకు మాత్రమే కాదు, జాతీయ భద్రతకు కూడా కీలక రంగంగా మారింది. 2020–21 కరోనా మహమ్మారి సమయంలో ప్రపంచం సెమీకండక్టర్ ప్రాముఖ్యతను ప్రత్యక్షంగా చూసింది. సరఫరా గొలుసు దెబ్బతినడంతో ఆటోమొబైల్ కంపెనీలు ఉత్పత్తిని నిలిపివేయాల్సి వచ్చింది. మొబైల్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్ పరికరాల కొరత ఏర్పడింది. ఒక చిన్న చిప్ లేకపోవడం వల్ల బిలియన్ డాలర్ల పరిశ్రమలు స్తంభించాయి. అప్పుడే అనేక దేశాలు తమకు సొంతంగా చిప్ తయారీ సామర్థ్యం అవసరమని గుర్తించాయి. ప్రస్తుతం ప్రపంచ సెమీకండక్టర్ తయారీలో తైవాన్, దక్షిణ కొరియా, అమెరికా, జపాన్, చైనా వంటి దేశాల ఆధిపత్యం కొనసాగుతోంది. ముఖ్యంగా తైవాన్ ప్రపంచంలో అత్యాధునిక చిప్‌ల తయారీలో అగ్రస్థానంలో ఉంది. అయితే భౌగోళిక ఉద్రిక్తతలు, సరఫరా గొలుసు ప్రమాదాల కారణంగా ప్రపంచ కంపెనీలు ఇప్పుడు "చైనా ప్లస్ వన్" వ్యూహాన్ని అనుసరిస్తున్నాయి. అంటే ఒకే దేశంపై ఆధారపడకుండా కొత్త తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయాలని చూస్తున్నాయి. ఈ పరిస్థితి భారత్‌కు చారిత్రాత్మక అవకాశాన్ని అందిస్తోంది. భారత్‌కు ఈ రంగంలో కొన్ని సహజమైన బలాలు ఉన్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద యువ జనాభా, లక్షలాది మంది ఇంజినీర్లు, బలమైన సాఫ్ట్‌వేర్ పరిశ్రమ, వేగంగా పెరుగుతున్న డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, ప్రపంచంలోనే అతిపెద్ద వినియోగదారుల మార్కెట్లలో ఒకటి.. ఇవన్నీ భారతానికి అనుకూల అంశాలు. ప్రపంచంలోని ప్రముఖ సెమీకండక్టర్ కంపెనీల పరిశోధన, డిజైన్ కేంద్రాల్లో వేలాది మంది భారతీయ ఇంజినీర్లు ఇప్పటికే పనిచేస్తున్నారు. అంటే చిప్ డిజైన్‌లో భారత్‌కు ప్రపంచ స్థాయి నైపుణ్యం ఉంది. ఇప్పుడు ఆ నైపుణ్యాన్ని తయారీ రంగానికి విస్తరించాల్సిన అవసరం ఉంది.

# ఏడడుగులే బాధ్యతల నడవడిక



యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః అని భారతీయ సంస్కృతి మహిళలను గౌరవించే సమాజాన్నే ఆదర్శంగా పేర్కొంటుంది. అదే సమయంలో భారతీయ కుటుంబ వ్యవస్థ మరో విలువను కూడా చెబుతుంది."గృహం నిలబడేది పరస్పర గౌరవం, నమ్మకం, బాధ్యతలతోనే." నేడు మహిళలపై జరుగుతున్న నేరాలు, లైంగిక వేధింపులు, గృహహింస, సైబర్ నేరాలు తీవ్రమైన ఆందోళన కలిగిస్తున్నాయి. వీటిని అరికట్టేందుకు కఠిన చట్టాలు, వేగవంతమైన విచారణలు, ప్రత్యేక న్యాయస్థానాలు అవసరమే. అయితే చట్టాలు మాత్రమే సమస్యకు సంపూర్ణ పరిష్కారం కావు. సమాజంలో విలువలు, కుటుంబాల్లో సంభాషణ, పరస్పర గౌరవం పెరగకపోతే నేరాల మూల కారణాలు అలాగే మిగిలిపోతాయి. అదే సమయంలో మరో వాస్తవాన్ని కూడా విస్మరించకూడదు. ఇటీవలి కాలంలో పురుషులు కూడా కుటుంబ సంబంధిత వివాదాలు, మానసిక వేధింపులు, తప్పుడు ఆరోపణలు, విడాకుల వివాదాలు, పిల్లల సంరక్షణ హక్కుల సమస్యలు, సామాజిక అవమానాలు వంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు తరచూ చర్చకు వస్తోంది. ప్రతి ఆరోపణ తప్పుడు అని చెప్పడం ఎంత తప్పో, ప్రతి పురుషుడే నేరస్థుడు అన్న భావన కూడా అంతే తప్పు. ప్రతి కేసు తన వాస్తవాలు, సాక్ష్యాలు, చట్టపరమైన ప్రక్రియ ఆధారంగానే పరిశీలించాలి. కుటుంబ న్యాయస్థానాల్లో పెరుగుతున్న కేసులు, విడాకుల సంఖ్య, భార్యాభర్తల మధ్య పెరుగుతున్న విభేదాలు సమాజానికి హెచ్చరికగా కనిపిస్తున్నాయి. కెరీర్ ఒత్తిడి, ఆర్థిక సమస్యలు, సమయాభావం, అహం, సోషల్ మీడియా ప్రభావం, అనుమానాలు, సంభాషణ లోపం.. ఇవన్నీ కలిసి దాంపత్య బంధాలను బలహీనపరుస్తు న్నాయి. చిన్న సమస్యలు కూడా మాట్లాడుకొని పరిష్కరించుకోవాల్సింది పోయి నేరుగా పోలీస్ స్టేషన్, కోర్టు వరకు వెళ్లే పరిస్థితులు కొన్ని సందర్భాల్లో కనిపిస్తున్నాయి. మహిళల రక్షణ కోసం రూపొందించిన చట్టాలు అవసరమైనవే. ఎందుకంటే మహిళలపై హింస ఒక వాస్తవ సమస్య. అయితే ఏ చట్టమైనా దుర్వినియోగం కాకుండా ఉండటం కూడా అంతే ముఖ్యం. చట్టం నిర్దోషిని శిక్షించకుండా, బాధితుడికి న్యాయం జరిగేలా సమతుల్యంగా అమలుకావాలి. అదే న్యాయవ్యవస్థ యొక్క ప్రాథమిక సూత్రం. అందుకే ప్రతి ఫిర్యాదును సానుభూతితో స్వీకరించడంతో పాటు, నిష్పాక్షిక దర్యాప్తు కూడా అంతే అవసరం. ఇది మహిళల సమస్య, పురుషుల సమస్య అని విడదీయలేని అంశం. ఇది కుటుంబాల సమస్య. కుటుంబం బలంగా ఉంటే సమాజం బలపడుతుంది. కుటుంబం బలహీనపడితే చట్టాలు ఎంత కఠినంగా ఉన్నా సామాజిక సమస్యలు పూర్తిగా తగ్గవు. వివాహం అనేది ఇద్దరు వ్యక్తుల మధ్య ఒప్పందం మాత్రమే కాదు; రెండు కుటుంబాలు, రెండు వ్యక్తిత్వాలు, రెండు ఆలోచనా విధానాల కలయిక. అలాంటి బంధం నిలవాలంటే కొన్ని విలువలు తప్పనిసరిగా ఉండాలి.

మొదటిది: సంభాషణ. చాలా కుటుంబ సమస్యలకు మూల కారణం మాట్లాడుకోకపోవడమే. కోపం వచ్చినప్పుడు మౌనం పాటించడం, సోషల్ మీడియాలో బాధను వ్యక్తం చేయడం కంటే భార్యాభర్తలు ఒకరితో ఒకరు ప్రశాంతంగా మాట్లాడుకోవడం ఉత్తమ పరిష్కారం.

రెండవది: పరస్పర గౌరవం. భార్య భర్తను గౌరవించాలి; భర్త భార్యను గౌరవించాలి. ఒకరి వ్యక్తిత్వాన్ని మరొకరు అవమానించడం, కుటుంబ సభ్యుల ముందు తక్కువ చేసి మాట్లాడడం, ఆర్థికంగా లేదా భావోద్వేగంగా నియంత్రించే ప్రయత్నం చేయడం బంధాన్ని దెబ్బతీస్తుంది.

మూడవది: నమ్మకం. సోషల్ మీడియా యుగంలో అనుమానాలు వేగంగా పెరుగుతున్నాయి. ఫోన్ చూడటం, పాస్‌వర్డ్‌లు అడగడం, నిరంతరం అనుమానించడం బంధాన్ని బలపరచదు. నమ్మకం సంపాదించేది ప్రవర్తనతో; బలవంతంతో కాదు.

నాలుగవది: కోపాన్ని నియంత్రించడం. మాటలతో చేసే హింస కూడా శారీరక హింసంతే ప్రమాదకరం. అవమానించడం, దూషించడం, బెదిరించడం, మానసికంగా కృంగదీయడం.. ఇవన్నీ కుటుంబాన్ని విచ్ఛిన్నం చేస్తాయి.

ఐదవది: ఆర్థిక పారదర్శకత. కుటుంబ ఆదాయం, ఖర్చులు, అప్పులు, భవిష్యత్ ప్రణాళికల గురించి ఇద్దరూ కలిసి నిర్ణయాలు తీసుకోవాలి. ఆర్థిక విషయాలను దాచిపెట్టడం అనుమానాలకు దారి తీస్తుంది.

ఆరవది: సమాన బాధ్యత. నేటి కుటుంబాల్లో భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు. అలాంటి పరిస్థితుల్లో ఇంటి పనులు, పిల్లల బాధ్యత, పెద్దల సంరక్షణ వంటి విషయాల్లో కూడా ఇద్దరూ భాగస్వామ్యం కావాలి. కుటుంబం ఒకరి భారం కాదు; ఇద్దరి బాధ్యత.

ఏడవది: విభేదాలను న్యాయపరమైన పోరాటంగా మార్చకూడదు. ప్రతి చిన్న సమస్యకు పోలీసు ఫిర్యాదు, సోషల్ మీడియా పోస్టులు, బహిరంగ ఆరోపణలు చేయడం కంటే కుటుంబ పెద్దలు, కౌన్సెలర్లు, మధ్యవర్తుల సహాయంతో పరిష్కారం వెతకడం అనేక సందర్భాల్లో ఉపయోగకరంగా ఉంటుంది. అయితే హింస, ప్రాణహాని, తీవ్రమైన దుర్వినియోగం వంటి పరిస్థితుల్లో మాత్రం చట్టపరమైన రక్షణను వెంటనే ఆశ్రయించడం అవసరం.

పిల్లలపై కూడా ఈ విభేదాల ప్రభావం తీవ్రంగా ఉంటుంది. తల్లిదండ్రుల గొడవల మధ్య పెరిగే పిల్లల్లో భయం, ఆందోళన, అస్థిరత పెరిగే అవకాశం ఉంది. కాబట్టి భార్యాభర్తల మధ్య విభేదాలు ఉన్నా, పిల్లల ఎదుట పరస్పరం అవమానించుకోవడం మంచిది కాదు. సమాజం కూడా ఒక మార్పు వైపు అడుగులు వేయాలి. మహిళల భద్రతను సమర్థించడమే కాదు, పురుషుల మానసిక ఆరోగ్యం, కుటుంబ ఒత్తిళ్లు, భావోద్వేగ సమస్యల గురించి కూడా బహిరంగంగా చర్చించే వాతావరణం ఏర్పడాలి. మహిళల హక్కులను కాపాడటం, పురుషులకు న్యాయం జరగడం.. ఈ రెండూ పరస్పర విరుద్ధమైన లక్ష్యాలు కావు. రెండూ ఒకేసారి సాధ్యమే. మహిళలు, పురుషులు ఒకరికి ఒకరు ప్రత్యర్థులు కాదు; జీవిత భాగస్వాములు. హక్కుల పోటీ కంటే బాధ్యతల భాగస్వామ్యం, ఆధిపత్యం కంటే సహజీవనం, అనుమానాల కంటే నమ్మకం, అహంకారం కంటే ప్రేమ బలంగా ఉంటేనే కుటుంబాలు నిలబడతాయి. సమాజం సురక్షితంగా ఉండాలంటే మహిళలు భయపడకూడదు; అదే సమయంలో నిర్దోషులైన పురుషులు కూడా అన్యాయానికి గురికాకూడదు. న్యాయం అంటే ఒకరి పక్షం కాదు.. సత్యం పక్షం. చట్టాలు నేరాలను శిక్షించాలి; కుటుంబాల్లో ప్రేమ, గౌరవం, సంభాషణ నేరాలు పుట్టకుండా చేయాలి. భార్యాభర్తలు ఒకరినొకరు గెలవడానికి కాదు, కలిసి జీవితాన్ని గెలవడానికి వివాహం చేసుకుంటారు. ఈ సత్యాన్ని గుర్తించిన రోజే కుటుంబాలు బలపడతాయి, సమాజం ఆరోగ్యకరమైన దిశగా పయనిస్తుంది.



గంగాధర్ బొమ్మకంటి
ఈవార్తలు దినపత్రిక చైర్మన్

భారతదేశానికి గ్రామాలే వెన్నెముక అని మహాత్మా గాంధీ చెప్పిన మాట నేటికీ ప్రాసంగికమే. దేశ జనాభాలో గణనీయమైన భాగం ఇప్పటికీ గ్రామాల్లోనే నివసిస్తోంది. వ్యవసాయం కోట్లాది కుటుంబాలకు ప్రధాన జీవనాధారం. అయితే వ్యవసాయం ఒక్కటే రైతు కుటుంబాలకు స్థిరమైన ఆదాయాన్ని అందించలేకపోతోంది. పెరుగుతున్న సాగు వ్యయం, వాతావరణ మార్పులు, ధరల హెచ్చుతగ్గులు, మధ్యవర్తుల ఆధిపత్యం వంటి కారణాలతో రైతు ఆదాయం అనిశ్చితంగా మారుతోంది.



# వ్యవసాయ పరిశ్రమలే రైతుకు లాభం

ఈ పరిస్థితుల్లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమల అభివృద్ధి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపునిచ్చే కీలక మార్గంగా కనిపిస్తోంది. భారతదేశంలో రైతు పంటను పండించిన తర్వాత కూడా అతనికి తగిన లాభం అందడం లేదు. కారణం, ఎక్కువ శాతం వ్యవసాయ ఉత్పత్తులు ముడి రూపంలోనే మార్కెట్‌కు చేరడం. ఉదాహరణకు టమాటాను నేరుగా విక్రయిస్తే ధర తక్కువగా ఉంటుంది. అదే టమాటాతో సాస్, ప్యూరీ, కేచప్ తయారు చేస్తే విలువ అనేక రెట్లు పెరుగుతుంది. మామిడిని పండుగా విక్రయించడం కంటే పల్ప్, జ్యూస్, పికిల్స్ రూపంలో విక్రయిస్తే రైతుకు, పరిశ్రమకు రెండింటికీ లాభం ఉంటుంది. అంటే వ్యవసాయానికి విలువ జోడించడం ద్వారానే రైతు ఆదాయం పెరుగుతుంది. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు అంటే కేవలం ఆహార ప్రాసెసింగ్ మాత్రమే కాదు. పాలు, పండ్లు, కూరగాయలు, ధాన్యాలు, పప్పుధాన్యాలు, మిర్చి, పసుపు, పత్తి, చెరకు, నువ్వులు, వేరుశెనగ, కొబ్బరి, సుగంధ ద్రవ్యాలు, ఔషధ మొక్కలు వంటి అనేక వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా వందలాది పరిశ్రమలు ఏర్పాటు చేయవచ్చు. పాలతో పన్నీర్, పెరుగు, నెయ్యి; పత్తితో వస్త్రాలు; చెరకుతో బెల్లం, చక్కెర, ఇథనాల్; మొక్కజొన్నతో స్టార్చ్, పశుగ్రాసం; మిర్చితో పొడి, పేస్ట్, ఎగుమతి ఉత్పత్తులు తయారు చేయవచ్చు. ఇలా ఒకే పంట అనేక పరిశ్రమలకు ముడిసరుకుగా మారుతుంది. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల అతిపెద్ద ప్రయోజనం గ్రామాల్లోనే ఉపాధి అవకాశాలు పెరగడం. పంట పండిన ప్రాంతంలోనే ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తే రైతులు దూర ప్రాంతాలకు సరుకు తరలించాల్సిన అవసరం తగ్గుతుంది. స్థానిక యువతకు ఉద్యోగాలు లభిస్తాయి. మహిళలకు కూడా ప్యాకేజింగ్, నాణ్యత తనిఖీ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ వంటి రంగాల్లో ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. ఫలితంగా గ్రామాల నుంచి నగరాలకు వలసలు తగ్గే అవకాశం ఉంటుంది.

మన దేశంలో పంట కోత అనంతరం భారీగా ఆహార ఉత్పత్తులు వృథా అవుతున్నాయి. సరైన నిల్వ సదుపాయాలు లేకపోవడం, కోల్డ్ స్టోరేజీలు కొరత, ప్రాసెసింగ్ యూనిట్లు లేకపోవడం వల్ల రైతులు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోంది. కొన్నిసార్లు పంటను రోడ్డుపై పారబోయాల్సిన పరిస్థితి కూడా వస్తోంది. పండ్లు, కూరగాయలలో కోత అనంతర నష్టాలు అధికంగా ఉండటం దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా నష్టమే. ప్రతి వ్యవసాయ క్లస్టర్‌లో కోల్డ్ చైన్, గిడ్డంగులు, ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తే ఈ నష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. తెలుగు రాష్ట్రాలకు ఈ రంగంలో అపార అవకాశాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో మామిడి, అరటి, జామ, బొప్పాయి, చేపలు, రొయ్యలు, మిర్చి, పాలు, పత్తి, చెరకు వంటి ఉత్పత్తులు సమృద్ధిగా లభిస్తున్నాయి. తెలంగాణలో పసుపు, మిర్చి, పత్తి, మొక్కజొన్న, నువ్వులు, పండ్లు, పప్పుధాన్యాల ఉత్పత్తి గణనీయంగా ఉంది. వీటి ఆధారంగా జిల్లాల వారీగా ప్రత్యేక ఫుడ్ ప్రాసెసింగ్ పార్కులు, అగ్రో పారిశ్రామిక క్లస్టర్లు ఏర్పాటు చేస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది. ఇటీవలి కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫుడ్ ప్రాసెసింగ్, ఒక జిల్లా–ఒక ఉత్పత్తి, ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల పథకం, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా విలువ ఆధారిత ఉత్పత్తులకు ప్రోత్సాహం ఇస్తున్నాయి. ఈ కార్యక్రమాలను మరింత విస్తరించి, గ్రామ స్థాయిలో చిన్న పరిశ్రమలు ఏర్పాటుకు సులభ రుణాలు, సాంకేతిక శిక్షణ, మార్కెటింగ్ సహాయం అందించాలి. అయితే పరిశ్రమలు ఏర్పాటు చేయడం ఒక్కటే సరిపోదు. నాణ్యత ప్రమాణాలు, ప్యాకేజింగ్, బ్రాండింగ్, ఆన్‌లైన్ విక్రయాలు, ఎగుమతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రపంచ మార్కెట్‌లో పోటీ పడాలంటే అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉత్పత్తులు తయారు చేయాలి. స్థానిక ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు (జీఐ ట్యాగ్), నాణ్యత ధ్రువీకరణ కల్పిస్తే రైతులకు మరింత ఆదాయం లభించే అవకాశం ఉంది.

ఈ రంగంలో స్టార్టప్‌ల పాత్ర కూడా కీలకం. వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, డ్రోన్ సేవలు, కోల్డ్ చైన్ లాజిస్టిక్స్, డిజిటల్ మార్కెటింగ్, ఈ–కామర్స్, ఫార్మ్–టు–ఫోర్క్ మోడళ్ల ద్వారా యువ పారిశ్రామికవేత్తలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశ చూపగలరు. కృత్రిమ మేధ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బ్లాక్‌చెయిన్ వంటి సాంకేతికతలను వ్యవసాయ సరఫరా గొలుసులో వినియోగిస్తే నాణ్యత, పారదర్శకత, మార్కెట్ అనుసంధానం మెరుగుపడుతుంది. అయితే కొన్ని సవాళ్లను కూడా అధిగమించాల్సి ఉంటుంది. చిన్న భూకమతాలు, రైతుల మధ్య సమన్వయం లేకపోవడం, మౌలిక సదుపాయాల కొరత, విద్యుత్ సమస్యలు, నాణ్యమైన రవాణా వ్యవస్థ లేకపోవడం, బ్యాంకు రుణాల లభ్యత, మార్కెట్ సమాచారం కొరత వంటి అంశాలు గ్రామీణ పరిశ్రమల అభివృద్ధికి అడ్డంకులుగా ఉన్నాయి. అందుకే ప్రభుత్వం, ప్రైవేట్ రంగం, రైతు సంఘాలు, సహకార సంస్థలు, విద్యాసంస్థలు కలిసి పనిచేసే సమగ్ర నమూనా అవసరం. వ్యవసాయం లాభదాయకంగా మారాలంటే రైతు కేవలం పంట పండించే వ్యక్తిగా కాకుండా వ్యవసాయ పారిశ్రామికవేత్తగా ఎదగాలి. పంట నుంచి ఉత్పత్తి వరకు, ఉత్పత్తి నుంచి బ్రాండ్ వరకు, బ్రాండ్ నుంచి మార్కెట్ వరకు మొత్తం విలువ గొలుసులో రైతు భాగస్వామి కావాలి. అదే గ్రామీణ అభివృద్ధికి శాశ్వత మార్గం. గ్రామాల అభివృద్ధి కేవలం సాగు భూములతో సాధ్యం కాదు; ఆ భూమి పండించిన పంటకు విలువను జోడించే పరిశ్రమలతోనే సాధ్యమవుతుంది. రైతు పొలం నుంచి నేరుగా పరిశ్రమకు, పరిశ్రమ నుంచి ప్రపంచ మార్కెట్‌కు ఉత్పత్తి చేరినప్పుడే గ్రామీణ భారతం నిజమైన ఆర్థిక శక్తిగా అవతరిస్తుంది. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు రైతు ఆదాయాన్ని పెంచడమే కాదు, యువతకు ఉపాధి, మహిళలకు ఆర్థిక స్వావలంబన, గ్రామాలకు పారిశ్రామిక ప్రగతి, దేశానికి స్థిరమైన అభివృద్ధిని అందించే బలమైన వేదికగా నిలుస్తాయి.



రామస్వామి చింత, మహబూబ్‌నగర్

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..



అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811


This newspaper is Owned and Published by BOMMAKANTI SHRAVAN KUMAR from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by BOMMAKANTI SHRAVAN KUMAR and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.